JAYABHERIDAILY.COM

తెలుగు దినపత్రిక

ప్రభాత

# జయభేరి

ప్రజల పక్షాన అక్షర యజ్ఞం

ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి

మేడ్చల్ - మల్కాజిగిరి । మంగళవారం 11-11-2025

Medchal - Malkajgiri । Tuesday 11-11-2025

jayabherinews

సంపుటి : 02 । సంచిక : 165 । పేజీలు : 8 । వెల : 5

Vol. 02 । Issue 165 । Pages : 8 । ₹: 5

విలేకర్లు కావలెను

మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...

9391 544 889
call me

jayabheripaper@gmail.com








- ఎర్రకోట సమీపంలో పేలిన కారు
- ఢిల్లీ పేలుడుతో కేంద్ర ప్రభుత్వం అలర్ట్
- 9 మంది మృతి 24 మందికి గాయాలు
- ముగ్గురు విషమం.. మృతుల సంఖ్య పెరిగే ప్రమాదం
- మిస్టరీగా ఉన్న ఢిల్లీ పేలుడు ఘటన.. ఇదివరకెప్పుడూ చూడని కొత్త తరహా బ్లాస్ట్..
- పేలుడు ధాటికి తీవ్రంగా దెబ్బతిన్న పలు వాహనాలు, దుకాణాలు
- పేలుడు సమయంలో కారులో ఉన్న ముగ్గురి మృతి
- ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ ఆరా
- ఘటనాస్థలికి హోం మంత్రి షా
- ఆస్పత్రిలో క్షతగాత్రులకు పరామర్శ
- ఉగ్రకుట్ర కోణంలోనూ ఎన్ఐఏ దర్యాప్తు
- కారు కదలికలపై వివరాల కోసం సీసీటీవీ కెమెరాల జల్లెడ

రెడ్‌పోర్ట్ ఏరియా సమీపంలోని మెట్రో స్టేషన్ గేట్1పార్కింగ్ ఏరియాలో పేలుడు సంభవించింది. బ్లాస్టింగ్ జరిగిన పదినిమిషాల్లోనే అగ్నిమాపక వాహనాలు స్పాట్‌కు చేరుకున్నాయి. మంటలను ఆర్పే ప్రయత్నం చేశాయి. కానీ అప్పటికే పేలుడు ధాటికి వాహనాలు తునాతునకలయ్యాయి. చెల్లాచెదురుగా మృతదేహాలు పడి ఉన్నాయి. ముందుగా ఒకరే చనిపోయారనుకున్నారు. కానీ మంటలు ఆర్పేదాకా తెలియలేదు, ఇది భారీ విధ్వంసమని, ఒకటి, రెండు, మూడు, నాలుగు..అనుకుంటుగానే మరణాల సంఖ్య 9కి చేరింది. 20మందికిపైగా గాయపడ్డారు. ఇంకా మరణాల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.. 13ఏళ్ల తర్వాత ఢిల్లీని పేలుళ్లు వణికించాయి. బ్లాస్ట్ అయిన ప్లేస్ చూస్తే గుండెలు జలదరిస్తాయి. అంత భయానకంగా ఉందా స్పాట్. ఇంత శక్తివంతమైన పేలుడు జరిగిందంటే, ఏదో కుట్ర జరిగే ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. మెట్రో గేట్ 1 దగ్గర ఉన్న ఒక సిగ్నల్ పాయింట్ దగ్గర రెడ్ సిగ్నల్ పడడంతో వెహికిల్స్ ఆగాయి. ఆగిన వెహికిల్స్‌లో ఒక వాహనంలో పేలుడు సంభవించినట్లు అధికారులు చెబుతున్నారు. పార్కింగ్ ఏరియా కావడం, పెద్దగా జనసమ్మర్ధం లేకపోవడంతో భారీ ప్రాణనష్టం తప్పింది కానీ, లేకుంటే చరిత్రలో ఊహించని అతిభారీ మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చేదంటున్నారు అధికారులు.. సాయంత్రం 6.52 గంటల ప్రాంతంలో ఎర్రకోట ట్రాఫిక్ సిగ్నల్ సమీపంలో నెమ్మదిగా కదులుతున్న వాహనంలో పేలుడు సంభవించిందని ఢిల్లీ పోలీసు చీఫ్ తెలిపారు. చాందినీ చౌక్ మెట్రో స్టేషన్ సమీపంలో కారులో పేలుడు సంభవించినట్లు తమకు సమాచారం అందిందని డిప్యూటీ చీఫ్ ఫైర్ ఆఫీసర్ ఎకె మాలిక్ తెలిపారు. రాత్రి 7:29 గంటలకు మంటలను అదుపులోకి తెచ్చినట్లు వివరించారు. ఈ పేలుడులో సమీపంలోని 22 వాహనాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి.

# అందెశ్రీకి ఘన నివాళులు



✍ జయభేరి,హైదరాబాద్, నవంబర్ 10 :


పల్లె జానపదం... ప్రకృతి వనం... ఉద్యమ చైతన్యం అన్నీ కలగలిసేలా అందెశ్రీ కలం ఉంటుంది. ఆయన రాసిన రచనలు, పాటలు ఉద్యమ స్ఫూర్తిని రగిలించాయి. గొర్రెల కాపరిగా జీవనం సాగించిన అందెశ్రీ చదువు లేకుండానే గొప్ప రచయితగా గుర్తింపు సాధించారు. తాను చూసిన పల్లెలు, ప్రజల జీవితం, ప్రకృతితో మేమకమవుతూ అద్భుత రచనలు చేశారు. ఆయన కలం నుంచి జాలువారిన 'జయ జయహే తెలంగాణ' పాటకు తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర గీతం గుర్తింపు ఇచ్చింది. ఈ పాటకు ఆస్కార్ విన్నర్ కీరవాణి మ్యూజిక్ అందించారు. జయ జయహే తెలంగాణ జననీ జయకేతనం... ఇలా ఎన్నో గొప్ప రచనలు చేసిన అందెశ్రీ సోమవారం ఉదయం కన్నుమూశారు. ఆయన మృతి పట్ల తెలంగాణ సీఎం రేవంత్ సహా పలువురు మంత్రులు, సాహిత్య ప్రముఖులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.



# మరికాసేపట్లో జూబ్లీహిల్ బైపోల్

✍ జయభేరి,హైదరాబాద్, నవంబర్ 10:

జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నిక పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. మంగళవారం ఉదయం ప్రారంభం కానున్న పోలింగ్ కోసం ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. యూసఫ్‌గూడలోని డీఆర్‌సీ సెంటర్‌లో ఈసీ అధికారులు సిబ్బందికి ఈవీఎంలను, పోలింగ్ స్టేషన్లను కేటాయించారు. ఎన్నికల సిబ్బంది సాయంత్రం లోగా పోలింగ్ స్టేషన్లకు చేరుకుంటారు. జిల్లా ఎన్నికల అధికారి ఆర్వీ కర్ణన్ పోలింగ్ ఏర్పాట్లను పరిశీలించారు.ఈసారి డ్రోన్ల ద్వారా సెక్యూరిటీ మానిటరింగ్ ఉంటుందని కర్ణన్ తెలిపారు. ప్రతి అభ్యర్థికి ఒక్కో పోలింగ్ ఏజెంట్ పాస్‌ను అందించినట్లు ఆయన పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై తెలంగాణ రాష్ట్రం మొత్తం ఆసక్తిగా ఉంది. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నాయి. ఓటర్లు ఎవరికి పట్టం కడతారో ఈ నెల 14న తేలనుంది.



# పేలుడు ఘటనపై మోదీ ఆరా

- పరిస్థితిపై కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో సమీక్ష

✍ జయభేరి,న్యూఢిల్లీ, నవంబరు 10:

ఢిల్లీ ఎర్రకోట సమీపంలో పేలుడు ఘటనపై ప్రధాని మోదీ ఆరా తీశారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షాను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో మోదీ పోస్ట్ పెట్టారు. ఘటనలో మృతిచెందినవారి కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలిపారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. హోంమంత్రి షాతో పాటు ఇతర అధికారులతోనూ మాట్లాడి పరిస్థితిని సమీక్షించినట్లు మోదీ ఎక్స్‌లో తెలిపారు. పేలుడు ఘటనపై అన్ని కోణాల్లో సమగ్ర దర్యాప్తు చేస్తున్నట్లు అమిత్ షా తెలిపారు. సమాచారం అందిన 10 నిమిషాల్లోనే ఘటనాస్థలానికి ఢిల్లీ క్రైం బ్రాంచ్, ఢిల్లీ స్పెషల్ బ్రాంచ్ చేరుకున్నాయని చెప్పారు. ఘటనపై ఎన్ఐఏ, ఎన్ఎస్‌జీ, ఫోరెన్సిక్ బృందాలు లోతుగా దర్యాప్తు చేస్తున్నాయన్నారు. అన్ని కోణాల్లో దర్యాప్తు జరిపి వాస్తవాలను ప్రజల ముందు ఉంచుతామన్నారు. మంగళవారం ఉన్నతాధికారులతో కీలక సమావేశం నిర్వహిస్తామన్నారు. మరోవైపు పేలుడు ఘటనలో బాధిత కుటుంబాలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సంతాపం తెలిపారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలంటూ ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, ఢిల్లీ సీఎం రేఖా గుప్తా పేలుడు మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. పుకార్లను నమ్మవద్దని రేఖాగుప్త ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పేలుడు ఘటనలో

...మిగతాది 2 లో



# ఉగ్రకుట్రకు ప్లాన్ చేస్తున్న హైదరాబాద్ డాక్టర్..

✍ జయభేరి,హైదరాబాద్, నవంబర్ 10 :

గుజరాత్ లోని అహ్మదాబాద్‌లో యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ (ATS) ముగ్గురు ఉగ్రవాదులను ఆదివారం అరెస్ట్ చేసింది. ముగ్గురు ఉగ్రవాదులలో ఒకరు హైదరాబాద్ కు చెందిన వ్యక్తి. కాగా, అతడు డాక్టర్ కావడం కలకలం రేపుతోంది. ప్రాణాలు పోయాల్సిన డాక్టర్ ఉగ్రవాద కార్యకలాపాలు చేస్తున్నాడని, ఐసిస్ సానుభూతి పరుడిగా గుర్తించి అరెస్ట్ చేశారు. నిందితుల వద్ద నుంచి రసాయన పదార్థాలు, తుపాకులు స్వాధీనం చేసుకున్నారు. అహ్మదాబాద్ సమీపంలోని అదాలత్ టోల్ ప్లాజా వద్ద అదుపులోకి తీసుకుని ప్రశ్నించడంతో ఉగ్రవాదుల కుట్రకోణం వెలుగు చూసింది. ముగ్గురు ఉగ్రవాదులలో ఒకరు హైదరాబాద్ కు చెందిన డాక్టర్ అహ్మద్ మోహియుద్దీన్ సయ్యద్, మరో ఇద్దరు ఉత్తరప్రదేశ్ కు చెందిన మొహమ్మద్ సుహెల్ సలీంఖాన్, ఆజాద్ సులేమాన్ షేక్‌లుగా గుజరాత్ ఏటీఎస్ గుర్తించింది. గుజరాత్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ (ATS) ఆదివారం నాడు చేపట్టిన ఆపరేషన్‌లో ఈ ముగ్గురు ఐసిస్ సానుభూతిపరులు దొరికిపోయారు. డాక్టర్ అహ్మద్ మోహియుద్దీన్ సయ్యద్ తన ఇంటినే ప్రయోగశాలగా మార్చివేసి ఆముదం గింజలను ప్రాసెస్ చేసి, వాటి వ్యర్థాలతో

...మిగతాది 2 లో



# రూ. లక్ష కోట్లకు పైగా పెట్టుబడులు

✍ జయభేరి,అమరావతి, నవంబర్ 10 :

ఏపీలో రూ. లక్ష కోట్లకు పైగా పెట్టుబడుల ప్రతిపాదనకు ఏపీ కేబినెట్ ఆమోదం తెలిపింది. క్వాంటమ్ కంప్యూటింగ్ విధానానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ మేరకు సీఎం చంద్రబాబు నేతృత్వంలో సోమవారం సమావేశమైన ఏపీ మంత్రివర్గం ఈ నిర్ణయాలు తీసుకుంది. కేబినెట్ భేటీ అనంతరం ఆ వివరాలను మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు వివరించారు. నేషనల్ క్వాంటమ్ మిషన్, మేధావులతో కలుసుకుని వెళ్లేలా క్వాంటమ్ కంప్యూటింగ్ విధానం ఉండనుందని తెలిపారు. క్వాంటమ్ కంప్యూటింగ్ సంస్థలు, కంప్యూటింగ్ విడిభాగాల సంస్థలకు, నిపుణులకు కేంద్రంగా ఏపీ మారుతోందని ధీమా వ్యక్తం చేశారు.క్వాంటమ్ కంప్యూటింగ్ కేంద్రంతో పెద్ద ఎత్తున స్టార్టప్‌లు వస్తాయని మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు.

...మిగతాది 2 లో

# ఢిల్లీ పేలుడుపై అన్ని కోణాల్లోనూ దర్యాప్తు..

✍ జయభేరి,న్యూఢిల్లీ:



ఎర్రకోట సమీపంలో సోమవారం సాయంత్రం జరిగిన భారీ పేలుడు ఘటనపై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా వేగంగా స్పందించారు. ఈ ఘటనపై అన్ని కోణాల నుంచి దర్యాప్తు జరుపనున్నట్టు చెప్పారు. 'సాయంత్రం 7 గంటలకు పేలుడు జరిగింది. ఎర్రకోట సమీపంలోని సుభాష్ మార్గ్ ట్రాఫిక్స్ సిగ్నల్ వద్ద Hyundai i20 కారులో పేలుడు సంభవించింది. ఈ పేలుడులో పలువురు పాదచారులు గాయపడగా, కొన్ని వాహనాలు దెబ్బతిన్నాయి. ప్రాథమిక సమాచారం ప్రకారం పలువురు ప్రాణాలు కోల్పోయారు.

...మిగతాది 2 లో



▶▶ మొదటిపేజీ తరువాయి

## ఢిల్లీలో భారీ పేలుడు

ఆ సమయంలో ఆ కారులో ప్రయాణికులున్నారు. పేలుడు ధాటికి దాని చుట్టుపక్కలున్న వాహనాలు కూడా తీవ్రంగా దెబ్బతిన్నాయి'' అని ఆయన తెలిపారు. వెంటనే అప్రమత్తమైన పోలీసు బలగాలతోపాటు.. జాతీయ దర్యాప్తు సంస్థ, ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్, సీఆర్పీఎఫ్, నేషనల్ సెక్యూరిటీ గార్డ్ సహా పలు ఏజెన్సీల అధికారులు అక్కడికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించినట్టు వివరించారు. పరిస్థితిని అనుక్షణం పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు సమాచారాన్ని కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు తెలుపుతున్నట్టు వెల్లడించారు. పేలిపోయిన కారులో ముగ్గురు ఉన్నట్టు మరో సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. ''పేలుడు జరిగిన చోట ఎలాంటి గుంతా పడలేదు. పేలుడు ధాటికి గాయపడ్డవారి శరీరాల్లో ఎలాంటి పెల్లెట్లూ కనిపించలేదు. బాంబు పేలుడు అయితే ఇలా జరగడం అసాధారణం. దీనిపై అన్నికోణాల్లో దర్యాప్తు చేస్తున్నాం'' అని ఆయన వివరించారు. అందులో భాగంగా.. ఆ కారు ఏయే ప్రాంతాల్లో తిరిగిందో తెలుసుకోవడానికి నగరంలోని అన్ని సీసీటీవీ కెమెరాలనూ జల్లెడపడుతున్నారు. పేలుడుకు ముందు ఏదైనా అనుమానాస్పదంగా కనిపించిందా? అని స్థానికులను, ప్రత్యక్షసాక్షులను ప్రశ్నిస్తున్నారు. ఆ ప్రాంతంలో పేలుడుకు ముందు నమోదైన ఫోన్‌కాల్స్ డేటాను విశ్లేషిస్తున్నారు.

హరియాణా రిజిస్ట్రేషన్‌తో ఉన్న హ్యూందాయ్ ఐ20 కారులో పేలుడు జరిగినట్టు పోలీసులు తెలిపారు. ఈ కారు నదీం అనే వ్యక్తి పేరిట ఉన్నట్టు సమాచారం. కారు యజమానిని ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిజానికి ఈ కారును ఏడాదిన్నర క్రితం సలీం అనే వ్యక్తి.. దేవేంద్ర అనే వ్యక్తికి విక్రయించాడని సమాచారం. గురుగ్రామ్ పోలీసులు వారిద్దరినీ అదుపులోకి తీసుకుని విచారించగా.. దేవేంద్ర ఆ తర్వాత ఆ కారును హరియాణాలోని అంబాలకు చెందిన వ్యక్తికి అమ్మినట్టు తెలిసింది. ''అంత పెద్ద భారీ పేలుడు శబ్దాన్ని మా జీవితంలో ఎప్పుడూ వినలేదు'' అని ఘటనాస్థలికి సమీపంలో ఉన్న ప్రత్యక్ష సాక్షులు పలువురు తెలిపారు. ''పేలుడు జరిగిన సమయంలో నేను నా దుకాణంలో ఉన్నాను. పేలుడు ధాటికి నా కుర్చీలోంచి కింద పడిపోయాను. వెంటనే లేచి బయటకు పరుగెత్తాను. చాలామంది ఆ సమయంలో తలోదిక్కుకూ పరుగులు తీయడం కనిపించింది'' అని అక్కడి ఒక దుకాణదారు చెప్పారు. ''నేను మా ఇంటి టెర్రస్ మీద ఉండగా.. పెద్ద పేలుడు శబ్దం వినిపించింది. చూస్తే దూరంగా అగ్ని జ్వాలలు. పేలుడు ధాటికి భవనాల కిటికీలు కదిలిపోయాయి'' అని మరో ప్రత్యక్ష సాక్షి తెలిపారు. పేలుడు ఘటనతో ఢిల్లీని అనుకుని ఉన్న యూపీ జిల్లాల్లో పోలీసు ఉన్నతాధికారులు అప్రమత్తమయ్యారు. మతపరంగా, ఇతరత్రా సున్నితమైన ప్రార్థన మందిరాలు, ఢిల్లీ సరిహద్దుల్లో భద్రత కట్టుదిట్టం చేశారు. ఈ పేలుడులో గాయపడ్డవారి కుటుంబసభ్యులు, బంధువులు.. విషయం తెలియగానే ఎల్ఎన్‌జేపీ ఆస్పత్రికి చేరుకుని తమవారి కోసం ఆందోళనతో ఆరా తీశారు. గాయపడ్డ తమవారిని చూడ్డానికి ఆస్పత్రి సిబ్బంది తమను అనుమతించట్లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా, పేలిన కారు కదలికల కోసం సీసీటీవీ కెమెరాలను జల్లెడ పట్టిన పోలీసులు.. ఆ కారు దరియాగంజ్ మార్కెట్ నుంచి బయల్దేరి సాయంత్రం 4 గంటల సమయానికి సునెహ్రీ మసీదు పార్కింగ్ ఏరియా వద్దకు చేరుకున్నట్టు గుర్తించారు. అనంతరం ఆ కారు మళ్లీ ఛత్తా రైల్‌చౌక్ వద్ద యూటర్న్ తీసుకుని.. లోయర్ సుభాష్ మార్గ్ దిశగా వెళ్తున్న దృశ్యాలను గుర్తించారు. అక్కడ ఆ కారు సిగ్నల్ వద్దకు చేరుకుంటూ నెమ్మదించిందని.. అప్పుడు పేలుడు జరిగిందని ఓ అధికారి తెలిపారు. పేలుడు దెబ్బకు కారులో ఉన్న ముగ్గురూ ఛిద్రమైపోయారని తెలిపారు. పేలుడు ఘటనపై కేంద్రం హోంమంత్రి అమిత్ షా ఢిల్లీ పోలీసు కమిషనర్‌తో, ఇంటెలిజెన్స్ బ్యూరో డైరెక్టర్, ఎన్ఐఏ చీఫ్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. పేలుడు ఘటనపై అన్ని కోణాల్లో సమగ్ర దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. పేలుడుకు కారణం ఏంటి అనేది ఇప్పుడే చెప్పలేమన్నారు. అనంతరం ఆయన ఎల్ఎన్‌జేపీ ఆస్పత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు. అక్కణ్నుంచీ నేరుగా ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఇక.. సోమవారం రాత్రి 12 గంటల సమయానికి.. మృతుల్లో.. అశోక్, అమర్ అనే ఇద్దరిని మాత్రమే పోలీసులు గుర్తించారు. మిగతా మృతదేహాలు ఎవరివో ఇంకా గుర్తించాల్సి ఉంది. ఈ పేలుడు తమ పనేనని ఇంతవరకూ ఏ ఉగ్రసంస్థా ప్రకటించలేదు.

## పేలుడు ఘటనపై మోదీ ఆరా

మరణాలు బాధాకరమంటూ లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. బాధిత కుటుంబాలకు సంతాపం తెలిపారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు, కేరళ సీఎం విజయన్, తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్, కర్ణాటక సీఎం సిద్ధరామయ్య తదితరులు పేలుడు ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

## ఉగ్ర కుట్రకు ప్లాన్ చేస్తున్న..

ప్రమాదకర రైసిన్ అనే విష పదార్థాన్ని తయారుచేసినట్లు పోలీసులు గుర్తించారు. మిగతా ఇద్దరు ఉగ్రవాదులు సలీంఖాన్, సులేమాన్‌లు ఢిల్లీ, అహ్మదాబాద్, లక్నో లాంటి పలు నగరాల్లో ఉగ్రదాడికి ప్లాన్ చేశారని ఏటీఎస్ డీఐజీ సునీల్ జోషి పేర్కొన్నారు. డ్రోన్ల సాయంతో పాకిస్తాన్ సరిహద్దు మీదుగా ఆయుధాలు సరఫరా చేస్తున్నారని సలీంఖాన్, సులేమాన్ లను అరెస్ట్ చేయగా.. విషపూరితమైన ప్రమాదకర రసాయనాలు తయారుచేస్తున్నాడని హైదరాబాద్ కు చెందిన డాక్టర్ అహ్మద్ మోహియుద్దీన్ సయ్యద్ లను అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. వీరిలో హైదరాబాద్ కు చెందిన డాక్టర్ కీలకంగా ఉన్నాడని గుర్తించారు. వీరికి సోషల్ మీడియా ద్వారా పరిచయం ఏర్పడగా.. ఓ గ్రూపుగా ఏర్పడి హైదరాబాద్ డాక్టర్ తయారుచేసిన ప్రమాదకర రైసిన్ ద్వారా దేశవ్యాప్తంగా భారీ విధ్వంసం సృష్టించేందుకు కుట్రకు ప్లాన్ చేసినట్లు ఏటీఎస్ పేర్కొంది.

**ఆజాద్‌పై క్రిమినల్ కేసు నమోదు కాలేదు - సోదరుడు**

ఆజాద్ సోదరుడు షెహజాద్ ప్రకారం, గుజరాత్ ATS నుండి ఫోన్ వచ్చింది. "మేము మీ సోదరుడిని పట్టుకున్నాము". నేను మాట్లాడమని చెప్పినప్పుడు, వారు రెండు మూడు గంటల తర్వాత మాట్లాడతామని చెప్పారు. అప్పటి నుండి, ఆజాద్‌తో లేదా ATS బృందంతో ఎటువంటి సంబంధం లేదు. తన సోదరుడిపై ఇక్కడ ఎలాంటి క్రిమినల్ కేసు నమోదు కాలేదని షెహజాద్ తెలిపాడు.ATS ద్వారా పట్టుబడిన ఆజాద్ తండ్రి సులేమాన్ మాట్లాడుతూ.. నా కొడుకు కష్టపడి పనిచేస్తాడు. తను బుధనాలోని ఒక మదర్సాలో కారియత్ చదువుతున్నాడు. అతను 6 లేదా 7 తేదీలలో ఇంటి నుండి వెళ్ళాడు. అక్కడ అతని మేనకోడలు, అతని పెద్ద సోదరుడి కుమార్తెను కూడా తీసుకువస్తానని చెప్పి వెళ్లిన వ్యక్తి తిరిగి రాలేదన్నారు.

## రూ. లక్ష కోట్లకు పైగా పెట్టుబడులు

ఒక బిలియన్ డాలర్ల పెట్టుబడులు ఆకర్షించడమే క్వాంటమ్ కంప్యూటింగ్ మిషన్ లక్ష్యమని పేర్కొన్నారు. ఐదు వేల మంది నిపుణులు, స్టార్టప్‌లు రాష్ట్రానికి వస్తాయని అంచనా వేశారు. రాష్ట్రంలో డిజిటల్ అనుసంధాన నైబర్‌హుడ్ వర్క్ స్టేషన్ల ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదం తెలిపిందని కొలుసు పార్థసారథి తెలిపారు. ప్రతి మండలంలో 2030 వర్క్ స్టేషన్ల ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. వర్క్ స్టేషన్లు ఏర్పాటు చేసే వారికి ప్రభుత్వం ఆర్థిక సాయం అందించనుందని చెప్పారు.విశాఖలో ఐటీ సంస్థల ఏర్పాటు ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం తెలిపిందని కొలుసు పార్థసారథి తెలిపారు. విశాఖలో రియాల్టీ లిమిటెడ్ ఐటీ పార్క్, రహేజా సంస్థ పరిశ్రమ ఏర్పాటుకు, రుషికొండ, కాపులుప్పాడలో పరిశ్రమల ఏర్పాటుకు ఆమోదం లభించిందని అన్నారు. తిరుపతి, ఓర్వకల్లులో పరిశ్రమల ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపిందని చెప్పారు. డెడికేటెడ్ డ్రోన్ ఇండస్ట్రీస్ ఏర్పాటు కోసం ఓర్వకల్లులో 50 ఎకరాలు కేటాయిస్తున్నామని తెలిపారు. నెల్లూరులో ఫైబర్ సిమెంట్ ప్లాంట్ కోసం బిర్లా గ్రూప్‌నకు భూమి కేటాయించినట్లు పేర్కొన్నారు. ఓర్వకల్లులో సిగాచి ఇండస్ట్రియల్ లిమిటెడ్ సింథటిక్ ఆర్గానిక్ ప్లాంట్‌కు వందెకరాలు ఇచ్చినట్లు చెప్పారు. అనకాపల్లి జిల్లాలో డోస్కో ఇండియా లిమిటెడ్‌కు 150 ఎకరాలు, కృష్ణా జిల్లా బాపులపాడులో వేద ఇన్నోవేషన్ పార్కు ఏర్పాటుకు 40 ఎకరాలు, అనంతపురంలో టీఎంటీ బార్ ప్లాంట్‌కు 300 ఎకరాలకు పైగా కేటాయించామన్నారు.

## అన్ని కోణాల్లోనూ దర్యాప్తు..

పేలుడు జరిగిన 10 నిమిషాల్లోనే ఢిల్లీ క్రైం బ్రాంచ్, ఢిల్లీ స్పెషల్ బ్రాంచ్ పోలీసు ఘటనా స్థలికి చేరుకున్నారు. ఎన్ఎస్‌జీ, ఎన్ఐఏ టీమ్‌లు, ఎఫ్ఎస్ఎల్ టీమ్‌లు కూలంకషంగా దర్యాప్తు జరుపుతున్నాయి. సమీపంలోని అన్ని సీసీటీవీ కెమెరాలు పరిశీలించాలని ఆదేశాలిచ్చాం. ఢిల్లీ సీపీ, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌చార్జితో మాట్లాడాను. వారిరువురూ ఘటనా స్థలి వద్ద ఉన్నారు. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని సమగ్ర విచారణ జరుపుతాం. ఆ వివారాలను పబ్లిక్‌కు తెలియజేస్తాం. ఆసుపత్రికి స్వయంగా వెళ్లి క్షతగాత్రుల పరిస్థితిని తెలుసుకుంటాను' అని అమిత్‌షా తెలిపారు.

# చావొక్కటే.. అన్నింటికీ పరిష్కారం కాదు

**జీవితంలో ఎదురయ్యే ఎలాంటి కష్టాన్నైనా ఎదుర్కోవాలి! ఎవరి జీవితం కూడా పూల పాన్పు కాదు. ఈ డైలాగ్‌ని.. మన జీవితంలో ఎప్పుడో ఒకసారి వినే ఉంటాం. ఎక్కడో ఓ చోట చదివే ఉంటాం. లైఫ్ అంటే.. ఎప్పుడూ సుఖంగా, అన్ని రోజులూ సంతోషంగా ఉండదని తెలుసు. కష్టాలు, సుఖాలు, సవాళ్లు, సమస్యలు.. అందరికీ ఉంటాయ్. ఇవన్నీ.. ఏదో ఒక ఫేజ్‌లో ఎదుర్కోక తప్పదు. అయినా సరే.. జీవితంలో ఎదురయ్యే ఎలాంటి కష్టాన్నైనా.. ఎదుర్కోవాలి. వాటన్నింటినీ ధైర్యంగా దాటుకొని.. ముందుకు సాగాలి. కానీ.. ఈరోజులు అలా లేవ్. కాలం మారేకొద్దీ.. పబ్లిక్ మరింత వీక్‌గా తయారవుతున్నారు. చిన్న చిన్న విషయాలకే.. చాలా పెద్ద నిర్ణయాలు తీసుకుంటున్నారు. తనువు చాలిస్తున్నారు. సమస్య వస్తే చాలు.. దాన్ని ఎదుర్కోలేక చచ్చిపోతున్నారు.**



ఇటీవలి కాలంలో చిన్నా, పెద్ద, యువత, ముసలి, ముతకా అనే తేడా లేదు. అందరిదీ అదే దారి. ఎంతో అందమైన జీవితాన్ని గెలవలేక.. అర్ధాంతరంగా చనిపోతున్నారు. అసలు.. ఓ చిన్న సమస్యని కూడా ఎదుర్కొనే ధైర్యం లేకుండా ఎలా ఉంటున్నారు? దేనినైనా తట్టుకోగలిగే, ఎదుర్కోగలిగే ఆత్మవిశ్వాసం ఏమైపోయిందనే ప్రశ్నలే.. ఇప్పుడు అందరిలోనూ తలెత్తుతున్నాయ్. సీఏ పరీక్షల్లో ఫెయిల్ అవడంతో విశాఖలో యువకుడు ఆత్మహత్య సీఏ పరీక్షల్లో ఫెయిల్ అవడంతో.. తల్లిదండ్రులను మోసం చేశాననే మనస్తాపంతో విశాఖలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. కొబ్బరితోట ఏరియాలో ఓ గదిని అద్దెకు తీసుకొని.. హీలియం గ్యాస్‌తో ముఖానికి కవర్ తగిలించుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు..మళ్లీ పాస్ అయ్యే చాన్స్ ఉంటుంది హైదరాబాద్‌లో రెండేళ్ల కూతురితో తల్లి ఆత్మహత్య హైదరాబాద్‌లో కుటుంబ కలహాలతో.. హుస్సేన్ సాగర్‌లో దూకి ఆత్మహత్య చేసుకుంది కీర్తిక అగర్వాల్. తనతో పాటు రెండేళ్ల చిన్నారి ప్రాణాన్ని కూడా తీసుకెళ్లిపోయింది. ఫ్యామిలీలో గొడవలున్నంత మాత్రాన, భర్తతో మనస్పర్థలు వచ్చినంత మాత్రాన.. చావే పరిష్కారమా? అంతగా ఇబ్బంది ఉంటే.. పెద్దవాళ్లను కూర్చోబెట్టి మాట్లాడటమో, కౌన్సిలింగ్ తీసుకోవడమో చేయాలి గానీ.. ఇలా ప్రాణాలు తీసుకోవడమేంటి? చిన్న చిన్న సమస్యలకే ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచన ఎందుకొస్తోంది? అనేదే.. ఎవ్వరికీ అంతుబట్టడం లేదు. తిరుపతిలో ఇంజనీరింగ్ చదువుతున్న 20 ఏళ్ల చందు అనే విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. తూర్పుగోదావరి జిల్లాలో.. తొర్రేడు తిరుమల కాలేజీలో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్న ఎల్ల సత్యదేవకుమార్ ఆత్మహత్య చేసుకున్నాడు. హాస్టల్‌లో తండ్రి దించి వెళ్లిన కొన్ని గంటల్లోనే.. సూసైడ్ చేసుకున్నాడు. హాస్టల్‌లో ఉండనని, ఇంటి దగ్గరే ఉండి చదువుకుంటానని మారాం చేశాడు. తల్లిదండ్రులు ఒప్పుకోకపోవడంతో.. ఆత్మహత్యే శరణ్యం అనుకున్నాడు. తల్లిదండ్రులు ఒప్పుకోకపోతే.. వారిని ఒప్పించే ప్రయత్నం చేయాలి. కూర్చోబెట్టి నచ్చజెప్పాలి. ఒకసారి కాకపోయినా.. మరోసారి వింటారు. కానీ.. హాస్టల్లోనే ఉండమన్నారనే బాధతో ప్రాణాలు తీసుకోవడమేంటి? చిత్తూరు జిల్లా సీతమ్స్ కాలేజీలో ఇంజనీరింగ్ స్టూడెంట్ సూసైడ్ చిత్తూరు జిల్లాలో సీతమ్స్ కాలేజీలో ఇంజనీరింగ్ స్టూడెంట్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మూడో అంతస్తు నుంచి దూకి చనిపోయాడు. కుటుంబంలో తీరని విషాదాన్ని మిగిలిస్తున్నారు. ప్రతి ప్రశ్నకు సమాధానం ఉన్నట్లే.. ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుంది. ప్రతి చీకటి వెనుక.. ఓ వెలుగు రేఖ దాగి ఉంటుంది. సమస్య ఎలాంటిదైనా.. పరిష్కారం ఓపిగ్గా ఆలోచించి వెతుక్కోవాల్సింది మనమే. సమస్యల్ని ధైర్యంగా ఎదుర్కొని.. జీవితాన్ని గెలవాల్సిందే! కానీ.. దేశవ్యాప్తంగా పెరిగిపోతున్న ఆత్మహత్యల పరంపర చూస్తుంటే.. సమాజం ఎటు వైపు పోతుందోనన్న భయం కలుగుతోంది. ప్రతి ఒక్కరూ.. చావే పరిష్కారమనే మూర్ఖపు ఆలోచనల నుంచి బయటకు రాకపోవడమే..గుండెల్ని పిండేస్తోంది. ఇప్పటికే ఉన్న ఆత్మహత్యల ఆందోళనల్ని మరింత పెంచుతోంది. మరి.. దీనికేంటి పరిష్కారం? చాలా మందిలో సన్నగిల్లుతున్న ఆత్మవిశ్వాసం కారణాలు ఏవైనా కావొచ్చు.. సమస్య ఎలాంటిదైనా ఉండొచ్చు.. కానీ.. తీరిగ్గా ఆలోచిస్తే ప్రతి ప్రాబ్లమ్‌కి.. కచ్చితంగా సొల్యూషన్ దొరుకుతుంది. కానీ.. ఏదైనా సమస్య వస్తే.. దాన్ని తట్టుకునేంత ఆత్మవిశ్వాసం చాలా మందిలో సన్నగిల్లుతోంది. వరుస ఆత్మహత్యల్ని చూశాక.. అర్థమవుతున్నది ఇదే. మార్కులు తక్కువొచ్చాయని, ఎగ్జామ్‌లో ఫెయిలయ్యామని, ప్రేమలో విఫలమయ్యామని, ఆర్థికంగా నష్టపోయామని, సోషల్ మీడియాలో ట్రోల్స్, కుటుంబ కలహాలు, వేధింపులు.. ఇలా చెప్పుకుంటూ పోతే.. అనేక కారణాలున్నాయ్. జీవితంలో భాగంగా ఎదురయ్యే చిన్న ఫెయిల్యూర్‌కి కూడా.. జీవితమే అంతమైపోయినట్లు భావిస్తున్నారు. ప్రతి సమస్యకు.. ఇన్‌స్టంట్ రిలీఫ్ కావాలి. ఎలాంటి ఇబ్బంది ఎదురైనా.. వెంటనే పరిష్కారం దొరికేయాలనుకుంటారు. సొల్యూషన్ కాస్త లేటైనా.. లైఫ్ ఎండింగ్ డెసిషన్ తీసేసుకుంటున్నారు. ఇతరుల జీవితాలతో పోల్చుకుంటూ.. తాము ఎందుకూ పనికిరామని నిరాశ చెందుతున్నారు. మిగతా వాళ్లలా.. తమ లైఫ్ ఎందుకు లేదని బాధపడుతుంటారే తప్ప.. వారి స్థాయికి ఎదగాలని అనుకోవడం లేదు. ఈ సోషల్ కంపారిజన్స్ కూడా.. సూసైడ్స్‌కి ఓ రీజన్‌గా కనిపిస్తోంది. చాలా మంది తమ సమస్యలకు పరిష్కారంపై దృష్టి పెట్టకుండా.. ఇతరులతో పంచుకోకుండా.. వాళ్లకు వాళ్లే కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఎంతోమందిపై.. వారు పెరిగిన కుటుంబ, సామాజిక వాతావరణం కూడా ప్రభావం చూపుతోంది. పిల్లల మార్కుల కోసం, ర్యాంకుల కోసం పేరెంట్స్ చేసే ప్రెజర్‌ని తట్టుకోలేని వాళ్లు చాలా మంది ఉంటున్నారు. వారు.. తమ తల్లిదండ్రుల ఆశల్ని అందుకోలేకపోయినప్పుడు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ఇక.. కుటుంబంలో ఉండే వాతావరణం కూడా వారి జీవితాలపై ప్రభావం చూపుతోంది. తమ సమస్యలు పంచుకునే వాతావరణం లేకపోవడం, ఒంటరితనం పెరగడం లాంటివి.. తనువు చాలించాలనే నిర్ణయాలకు దారి చూపుతున్నాయ్. ఆత్మహత్య.. ఎప్పటికీ సమస్యకు పరిష్కారం కాదు. పైగా.. అది ఎవరూ పరిష్కరించలేని మరో సమస్యని సృష్టిస్తుంది. తమనే నమ్ముకున్న వారి జీవితాలను ప్రశ్నార్థకం చేస్తుంది. ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి బాధ అక్కడితో అంతమవుతుంది. కానీ.. ఆ బాధ మొత్తం కుటుంబ సభ్యులకు, స్నేహితులకు, శ్రేయోభిలాషులకు వారసత్వంగా మిగులుతుంది. ఇది.. మిగతా వారి జీవితాలపై ప్రభావం చూపుతుంది. జీవితమనేది.. ఆ భగవంతుడు ఇచ్చిన బహుమతి. జీవితమనేది.. లైఫ్ జర్నీలో ఎదురయ్యే సంఘటనలతో అనుభవాలని నేర్చుకునేందుకు, అప్పుడప్పుడు వచ్చే సమస్యలను అధిగమించేందుకు.. ఓ చక్కని అవకాశం. ప్రతి సమస్య ఓ పాఠాన్ని నేర్పుతుంది. చచ్చేంత ధైర్యం.. బతకడానికి ఎందుకు లేదనే ప్రశ్న కూడా ఇప్పుడు ఉత్పన్నమవుతోంది. ఆత్మహత్యకు ప్రయత్నించే వ్యక్తిలో అపారమైన ధైర్యం, కఠినమైన నిర్ణయం తీసుకునే శక్తి ఉంటుంది. ఆత్మహత్యకు ప్రయత్నించే వ్యక్తిలో అపారమైన ధైర్యం, కఠినమైన నిర్ణయం తీసుకునే శక్తి ఉంటుంది. అదే ధైర్యాన్ని.. జీవితంలో ఎదురయ్యే సవాళ్లని ఎదుర్కొనేందుకు, పోరాడేందుకు ఉపయోగిస్తే పరిస్థితులు పూర్తిగా మారిపోతాయ్. జీవితంలో ఎదురయ్యే కష్టాలకు ముగింపు ఆత్మహత్య కాదు.. సమస్యలున్నోళ్లు ఎవరైనా ఆలోచించాల్సింది.. ఆత్మహత్యలు ఎలా చేసుకోవాలని కాదు. సమస్య నుంచి పారిపోవడం కాదు.. పోరాడటం నేర్చుకోవాలి. ఓటమే.. అంతం అనుకోవద్దు. అదొక పాఠంగా భావించాలి.

# నేనుఅనే పదాన్ని శ్రీకృష్ణుడు ఎలా వివరించాడు?

జయభేరి ఆధ్యాత్మిక శీర్షిక





Dr. హరి హర నాద రాజు
శంబాలా 360 సొల్యుషన్స్
9177 445 591
www.shambala360solutions.com

**నేను అనుకునే వారు .. ఈ సత్యం చదువుకోండి..
మీ జీవితమే మారిపోతుంది..!
నేను అనే పదాన్ని శ్రీకృష్ణుడు ఎలా వివరించాడు.. నన్ను.. తాను అంటే ఎవరు.. భయం.. క్రోధం అంటే ఏమిటి..
ఆత్మన్... అనే మాటకి అర్థం ఏమిటి. ..
నేను అంటే ఎవరు..
శ్రీకృష్ణుడు అర్జునుడికి ఉపదేశించిన సత్యం చదివితే జీవితమే మారిపోతుంది ఇప్పుడు ఆ సత్యం గురించి తెలుసుకుందాం..**

నా... భావం పొందటానికి ... నన్ను... ఆశ్రయించి నన్ను గురించిన జ్ఞానాన్ని చింతన చేస్తూ, నా కోసం తపస్సు చేస్తే రాగం, భయం, క్రోధం వంటివి... నేను... ప్రతికూలంగా ఉండే లక్షణాలు వాటంతట అవే పోతాయి. అప్పుడు ఆ సాధకుడు. లేక భక్తుడు... నా... తో నిండి... నా యందే నిలిచి ఉంటాడు.

కృష్ణుడు చెప్పిన ఈ మాట అర్థం కావాలంటే... నేను.. అంటే ఏమిటో తెలియాలి. సంస్కృతంలో ఉన్న... ఆత్మన్... అనే మాటకి సమానార్థకమైన తెలుగుపదం... నన్ను... లేదా తాను... ఆత్మన్ అంటే సర్వజీవులలో ప్రాణస్వరూపంగా ఉండే పరమాత్మ అంశ. పరమాత్మ ఒక పెద్ద వెలుగు ముద్ద అయితే, జీవాత్మలు దాని నుండి వెలువడిన చిన్న చిన్న వెలుగు రవ్వలు. ఇవి తిరిగి ఆ పెద్ద వెలుగులో లయం (కలిసి) పోతాయి. కాని నశించవు. ఎట్లాగంటే, నీళ్ళలో తేలుతున్న మంచుముక్క నీటి కంటే వేరుగా కనిపిస్తుంది. కానీ... కరిగి పోయాక నీళ్ళలో కలిసిపోతుంది. కరిగి లయం కావాలంటే... నేను... అంటే ఏమిటో తెలుసుకోవాలి. నిజానికి ప్రతి మనిషికి ఉన్న అసలు పేరు... నేను... ఎవరు ఏ పేరుతో, ఏ చుట్టరికంతో పిలిచినా ప్రతివారు తమని తాము... నేను...అనే చెప్పుకుంటారు. ఎందుకంటే ప్రతిజీవి పరమాత్మ ప్రతిరూపమే కదా! తెలియకుండానే, అప్రయత్నంగా ఆ జ్ఞానం మాటల్లో వ్యక్తమవుతుంటుంది. అంతర్గతంగా నిక్షిప్తమై ఉన్న ఈ జ్ఞానాన్ని గుర్తించటమే చేయవలసిన సాధన. భగవద్గీతలో ఎక్కడెక్కడ ...నేను... అని ఉన్నదో అక్కడక్కడ కృష్ణుడు అనే అర్థం తీసుకోకుండా చదువుతున్న లేదా వింటున్న ప్రతివారు .. తను..అనే అర్థం చేసుకుంటే భగవద్గీత అసలు అర్థం ఆచరణయోగ్యంగా దర్శనమిస్తుంది. లేకపోతే చదవటమే కానీ, జీవితానికి అన్వయం చేసుకుని ప్రయోజనం పొందటం అనేది ఉండదు.

నేను... అనే భావం పొందటానికి ఆశ్రయించవలసింది... నేను... నే... నేను... కి సంబంధించిన జ్ఞానాన్ని పొంది. దానిని గురించే తపస్సు చేయాల్సి ఉంది. తపస్సు అంటే తీవ్రమైన తపన. అనుకున్నది పొందే వరకు విహ్వాలతతో గిలగిలలాడి పోవటం ప్రయోగశాలల్లో అహోరాత్రులు నిద్రాహారాలు మరచిపోయి పరిశోధనల్లో మునిగి పోయిన శాస్త్రవేత్తల కృషి తపస్సే. ప్రపంచం, పరిసరాలు తెలియకుండా చదరంగం మొదలైన ఆటల్లో మునిగిపోయిన వారిదీ తపస్సే. అదే విధంగా... నేను... గురించి తెలుసుకుని.. దానిని పొందాలని చేసే సాధనే తపస్సు. నేను గురించిన జ్ఞానమే... ఆత్మజ్ఞానం... ఈ జ్ఞానసముపార్జన తపస్సులాగా చేస్తుంటే రాగం, భయం, క్రోధం చల్లగా జారుకుంటాయి. రాగం అంటే వ్యక్తులు లేక పదార్థాల ప్రత్యేక స్వభావాలు, పేర్లు. ఆకారాల పట్ల కోరిక గాఢంగా ఉండటం. అకారణంగా విపరీతమైన ఇష్టం. దీనికి రెండో పార్శ్వం... ద్వేషం. ఈ రెండూ కూడా అడుగడుగున అడ్డు తగిలే ప్రతి బంధకాలు . మరొకటి భయం. కావలసినది దొరకదేమో...ఉన్నది పోతుందేమో అన్నభావనే భయానికి కారణం. అంటే.. కోరిక, లోభం అనేవే భయహేతువులు. భయం ఉన్న వారు ఏదీ చేయలేరు. ఈ చేతకానితనం వల్ల కోపం వస్తుంది. ఆ కోపం దీర్ఘకాలికంగా నిలిచి ఉంటే క్రోధంగా పరిణమిస్తుంది. కోపం రావటం మానవ సహజం. వెంటనే మరచి పోవటం ఉత్తముల లక్షణం. దానిని పెంచి పోషించినప్పుడు క్రోధం అవుతుంది. క్రోధం శారీరక, మానసిక ఆరోగ్యాలని హరిస్తుంది. దేని మీద దృష్టి కేంద్రీకరించటం కుదరదు.

రాగం, భయం, క్రోధం ఎట్లా పోతాయి? అందరిలో ఉన్న ...నేను... ని ఆశ్రయించటం. ..నా... లోనూ, ఇతరులోనూ ఉన్న ...నన్ను..(నేనుని) నిరంతరం స్మరిస్తూ ఉండటం వల్ల ...నా... యందు ఉండి, ....నా.... స్థితిలో స్థిరంగా ఉండటం జరుగుతుంది. అంటే స్వంత అభిప్రాయాలని, ఇతరులు గురించి తను ఏర్పరచుకున్న అభిప్రాయాలని అందరిలోనూ అంతర్యామిగా ఉన్న .... నేను... కి సమర్పించటమే. అందరిలోను ఆత్మస్వరూపంగా ఉన్నది పరమాత్మయే అనే దృష్టితో చూడటం మొదలు పెట్టినప్పుడు ఎవరిపైనా రాగం లేదా ద్వేషం ఉండదు. భయపడటానికి క్రోధం పెంచుకోవటానికి పరాయి వారెవరు లేరు కదా! ఈ రకమైన భావన కలగటానికి తగిన సమర్థత, తపస్సు వల్ల మాత్రమే కలుగుతుంది. తపస్సు అంటే శరీరానికి, మనస్సుకి, మాటకి క్రమశిక్షణ నివ్వటం. ఈ మూడు విధాలైన తపస్సుల గురించి తరువాత వివరంగా చెప్పటం ఉంది. ఈ మూడు విధాలైన తపస్సుల వల్ల జ్ఞానం కలుగుతుంది. ఇక్కడ ...జ్ఞానం..అంటే బాహ్యమైన ఆకారాలు, పేర్లు మొదలైన వాటి మీద మనసు నిలవక లోపల ఉన్న అస్తిత్వంలో మనసు లీనమై .... నేను... గా ఉంటుంది. ఆ స్థితిలో చేసే పనుల వల్ల కర్మ బంధం లేక జీవితం పవిత్రంగా సాగుతుంది.

అందరిలో ఉన్న ...నేను... ని చూడటమంటే అందరూ ఒకే విధంగా చూడలేరు కదా. ఎవరు ఎట్లా చూస్తే అట్లా వారికి ..నేను... ప్రసన్నమవుతానని కృష్ణుడు. అర్జునుడితో చెప్పాడు. ఎవరిని ఎట్లా భావించినా, వారు అవతలి వారిలో ఉన్న...నన్నే... భావిస్తున్నారు, కనుక నా మార్గంలోనే సాగుతున్నట్టే....నన్ను... ఉపాసించేదారులు ఎన్నో ఉన్నాయి. కొంతమంది తమ పనులు సిద్ధించాలని వేరు వేరు దేవతలని ఉపాసిస్తూ ఉంటారు. వాళ్ళు కూడా ఆయా దేవతల రూపాల్లో... నన్నే... ఉపాసిస్తున్నారు. సృష్టిలో సమస్తమైన జీవుల్లో జీవాత్మ రూపంగా ఉన్న పరమాత్మని గుర్తించమని శిష్యుడైన అర్జునుడికి ఉపదేశించాడు జగద్గురువు. అంటే అణువణువునా సర్వవ్యాపి అయిన విష్ణువుని దర్శించి లయం కావటమని అర్జునుడికి శ్రీకృష్ణుడు ఉపదేశించాడాడని తెలుస్తుంది.

# కొండమల్లేపల్లి ఏబీవీపీ నూతన కార్యవర్గం ఎన్నిక

- విద్యార్థులలో దేశభక్తి పెంచుతూ భారతదేశంలో విద్యార్థులని ఒక స్టూడెంట్ ఆర్మీల తయారుచేసే ఆర్గనైజేషన్ - ఏబీవీపీ

జయభేరి,కొండమల్లేపల్లి :



అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ కొండమల్లేపల్లి శాఖ ఆధ్వర్యంలో సోమవారం నాడు నూతన కొండమల్లేపల్లి ఏబీవీపీ ఆధ్వర్యంలో కమిటీ నిర్వహించారు. ఈ కార్యక్రమం లో ఏబీవీపీ నల్గొండ విభాగ్ ప్రముక్ కత్తుల ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ 1949 జూలై 9న కేవలం నలుగురు వ్యక్తులతో స్థాపించబడిన సంస్థ ఈరోజు ప్రపంచంలో నే నెంబర్ వన్ స్టూడెంట్ ఆర్గనైజేషన్ గా నిలిచిందని అలాగే ఏబీవీపీ చేసే కార్యక్రమాల గురించి వారు వివరించారు. దేవరకొండ లోని జూనియర్ కళాశాల ఆటస్థల ప్రాంగణంలో వెజ్ నాన్ వెజ్ మార్కెట్ యార్డ్ నిర్వహించొద్దని ఏబీవీపీ పోరాటం చేసిందని, కథన బేరి మార్పు కోసం మహా ఉద్యమం అనే కార్యక్రమాన్ని చేపట్టి గతంలో ఉన్న బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించి విజయం సాధించిందని అన్నారు. అదేవిధంగా కరోనా సమయంలో ఏబీవీపీ చేసిన సేవా కార్యక్రమాల గురించి అదే సమయంలో చేపట్టిన కోటివృక్ష అభియాన్ అనే కార్యక్రమం గురించి ఏబీవీపీ దేశం కోసం పనిచేసే విధానాన్ని క్లుప్తంగా విద్యార్థులకు వివరించారు.

నూతనంగా కమిటీలో ఎన్నికైన వారు నూతన కొండ మల్లేపల్లి కార్యదర్శిగా పర్వతం దినేష్ జాయింట్ సెక్రెటరీగా ఎన్.స్పందన, కె. వైష్ణవి, పి. మేఘన,కుమార్, గణేష్, హేమంత్, సాయి చరణ్ వైస్ ప్రెసిడెంట్ శిరీష, నందిని, మురళి, లక్ష్మణ్, రాకేష్, రాఘవేంద్ర, సందీప్ నగర్ గర్ల్స్ కన్వీనర్ బి. సుస్మిత, అనుష్క, నగర సోషల్ మీడియా కన్వీనర్ ఎన్.చరణ్ స్టూడెంట్ ఫస్ట్ డెవలప్మెంట్ (SFD) కన్వీనర్ ఈ మహేష్, ఏంటి ఆరిఫ్, స్టూడెంట్ ఫర్ సేవ (SFS) కన్వీనర్ ఆర్ రాకేష్, ఎన్ యశ్వంత్ నగర కార్యవర్గ సభ్యులు మానస, సప్న, లోహిత, అమ్ములు, అఖిల్ సందీప్ తదితరులను ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో నల్లగొండ విభాగ్ హాస్టల్స్ కన్వీనర్ యలమల గోపీచంద్, పూర్వ కార్యకర్త కొత్త అఖిల్, దమ్ముజు అమితేష్, భూష రాజు రాకేష్, శివ, దయాకర్, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.



# వరంగల్లు బిడ్డకు మాస్టర్ ఆఫ్ లా..

- గోల్డ్ మెడల్ అందుకున్న కలకోల అనిల్
- న్యూఢిల్లీ వేదికగా అనిల్ కి గోల్డ్ మెడల్ సత్కారం

జయభేరి,హైదరాబాద్ :

ఇంటర్నేషనల్ లా ఎస్ఆర్ఎం యూనివర్సిటీ న్యూ ఢిల్లీలో గల ఈ యూనివర్సిటీలో ఎల్ ఎల్ ఎం చేసినందుకుగాను న్యూఢిల్లీలో కలకోల అనిల్ కు బంగారు పథకం తో పాటు సత్కారం లభించింది. ఈ సందర్భంగా తన తల్లిదండ్రులైన కలకోల అశోక్ బాబు, తల్లి కలకోల రేణుక వారి ఆనందానికి హద్దులు లేకుండా పోయాయి.. ఈ సందర్భంగా తమ బిడ్డ అత్యున్నత స్థానానికి చేరుకొని గోల్డ్ మెడల్ సాధించిన సందర్భంగా గ్రామస్తులంతా ఆనందాన్ని వ్యక్తం చేశారు. చిన్నప్పటినుండి కష్టపడి న్యాయవాద వృత్తిలో పేదవారికి ఎంతోమందికి సహాయ సహకారాలు అందిస్తున్న తమ కుమారుని నిర్విరామ కృషికి దక్కిన గౌరవం అంటూ తల్లిదండ్రులు ఉద్విఘ్న భరితంగా మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా గోల్డ్ మెడల్ అందుకున్న అనిల్ మాట్లాడుతూ.. ఏడవ తేదీ నవంబర్ 2025న న్యూఢిల్లీలోని ఇంటర్నేషనల్ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ఆధ్వర్యంలో గోల్డ్ మెడల్ అందుకున్నట్టు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా స్నేహితులు శ్రేయోభిలాషులు బంధువులు కుటుంబ సభ్యులతో పాటు పలు సంస్థలు ఆయనకు సత్కారం చేయనున్నాయి.. కష్టపడితే సాధించలేనిది ఏదీ లేదంటూ ప్రతిభకు ఉన్న గౌరవాన్ని ఆయన మాటల్లో చెప్పలేనిది అంటూ సంతోషంతో పొంగిపోయారు. ఇది జీవితంలో మరిచిపోలేనిది అంటూ ఉద్విగ్న భరితంగా మాట్లాడారు.. ఈ కార్యక్రమంలో చీఫ్ గెస్ట్ గా వైస్ ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా సిపి రాధాకృష్ణన్, హర్యానా గవర్నర్ ప్రొఫెసర్ ఆషీమ్ కుమార్ ఘోష్ తదితరులు పాల్గొన్నారు.



# మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులుగా మాలోత్ సురేష్ ఎన్నిక

జయభేరి,గార్ల, నవంబర్ 10:

డెమోక్రటిక్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (వర్కింగ్ )మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు గా గార్ల మండలం,చిన్నకిష్టపురం గ్రామానికి చెందిన మాలోత్ సురేష్ ను హనుమకొండ పట్టణంలోని ఆదర్శ లా కళాశాల లో జరిగిన ఉమ్మడి ఓరుగల్లు మహాసభ లో జాతీయ అధ్యక్షులు మానసాని కృష్ణారెడ్డి సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సురేష్ తెలిపారు.ఈ మహాసభకు ప్రత్యేక ఆహ్వానితులుగా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హాజరైయి ప్రసంగించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ,జర్నలిస్టుల హక్కుల సాధనకై పోరాడుతానని,అక్రిడేషన్లతో సంబంధం లేకుండా ప్రతి జర్నలిస్టుకు ఇంటి స్థలాలు ఇవ్వాలని కోరారు.




# మండల న్యాయ సేవా సంస్థ దేవరకొండ

జయభేరి,డిండి :



డిండి మండలంలో తౌక్లాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో జక్కుల వెంకటయ్య తండ్రి పుల్లయ్య అను అతను తన స్వంత స్థలంలో ఇంటి నిర్మాణం చేపట్టాడు. ఇట్టి నిర్మాణంలో కొంత కొంత భాగం నిర్మాణం ప్రభుత్వ అనుమతి లేకుండా నిర్మాణం చేపట్టడంతో గుత్తా ప్రభాకర్ రెడ్డి అనే వ్యక్తి దేవరకొండ లోని మండల న్యాయ సేవా సంస్థకు ఫిర్యాదు చేశాడు. ఇట్టి విషయమై గౌరవ సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవా సంస్థ చైర్మన్ శ్రీమతి కె అనిత స్పందించి సదరు గ్రామ పంచాయతీ కార్యదర్శి కె. చిరంజీవి కి సమస్య పరిష్కారం నిమిత్తం ఆదేశాలు జారీ చేశారు.



గ్రామపంచాయతీ కార్యదర్శి ఆదేశాల అనుసారం గ్రామంలోకి వెళ్ళి ఇంటి నిర్మాణం చేయుచున్న జక్కుల వెంకటయ్యతో మాట్లాడి, పర్మిషన్ గురించి పూర్తి అవగాహన కల్పించి వారి యొక్క మొత్తం ఇంటి నిర్మాణం కొరకు ప్రభుత్వ ద్వారా రిజిస్ట్రేషన్, పర్మిషన్ తీసుకునేటట్లు చేసినారు. దేవరకొండ మండల న్యాయ సేవా సంస్థలో దరఖాస్తు చేయగానే శ్రీమతి కే అనిత మండల న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జ్ మండల న్యాయ సేవా సంస్థ, దేవరకొండ ద్వారా సమస్యను పరిష్కరించడం జరిగినది.

# బేటి బచావో బేటి పడావో కార్యక్రమం

జయభేరి,దేవరకొండ :



ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో దేవరకొండ 12 అంగన్వాడి అయ్యప్ప నగర్ లో బేటి బచావో బేటి పడావో కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిడిపిఓ చంద్రకళ మాట్లాడుతూ అమ్మాయికి 18 సంవత్సరాలు అబ్బాయికి 21సంవత్సరాలు నిండిన తర్వాతనే వివాహం చేయాలని ,అప్పుడే వారు శారీరకంగా, మానసికంగా ఎదుగుతారని వివరించడం జరిగింది. అలాగే సోషల్ మీడియా, లైంగిక వేధింపులు, మానవ అక్రమ రవాణా, అక్రమ దత్తత విషయాలపై అవగాహన కల్పించారు. సూపర్వైజర్ M .విజయలక్ష్మి మాట్లాడుతూ వర్షాలు ఎక్కువగా వచ్చిన కారణంగా మన చుట్టూ ఉన్నటువంటి పరిసరాల పరిశుభ్రత గురించి ,వ్యక్తిగత పరిశుభ్రత గురించి, అలాగే కరెంట్ షార్ట్ రాకుండా తీసుకోవాల్సిన విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ వినోద ,ఆయ సులోచన తల్లులు పాల్గొన్నారు. శకృతండ గ్రామపంచాయతీ పరిధిలో గల మూడవత్ అనూష భర్త బాలు,మూడవ కాన్పులో ఆడపిల్లకు దేవరకొండ ప్రభుత్వ హాస్పిటల్ లో జన్మనివ్వడం జరిగింది ,సిడిపిఓ సూపర్వైజర్ అంగన్వాడి టీచర్ దేవి ప్రభుత్వ హాస్పిటల్ కి వెళ్లి వారికి మూడవ కాన్పులో ఆడపిల్లైన అధైర్యపడవద్దని వారికి ప్రభుత్వం అన్ని రకాల వసతులు కల్పిస్తుందని కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగినది.

# యుద్ధం మొదలైంది.. మాలల రణభేరి...

- నవంబర్ 23న, మాలల రణభేరి మహాసభ ను జయప్రదం చేయండి
- మాల మహానాడు జాతీయ అధ్యక్షులు జి చెన్నయ్య, రాష్ట్ర అధ్యక్షులు బూర్గుల వెంకటేశ్వర్లు పిలుపు




జయభేరి,హైదరాబాద్ :

హైదరాబాద్ లో నవంబర్ 23న సరూర్ నగర్ స్టేడియం గ్రౌండ్ లో తలపెట్టిన మాలల రణభేరి మహాసభ విజయవంతం కోసం మాలల చైతన్య యాత్రలో బాగంగా మహబూబ్ నగర్ కు వచ్చిన మాల మహానాడు జాతీయ అధ్యక్షులు జి చెన్నయ్య, రాష్ట్ర అధ్యక్షులు బూర్గుల వెంకటేశ్వర్లు గార్లు, డాక్టర్ అంబేద్కర్ కళా భవన్ లో ముఖ్య నాయకులతో కలిసి మహాసభ కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం వారు మీడియాతొ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుత జనాభా లెక్కలు లేకుండా, ఎలాంటి ఎంపరికల్ డేటా తీసుకోకుండా సుప్రీం కోర్టు సూచనలను పాటించకుండా 2011 జనాభా లెక్కల తో వర్గీకరణ చేసిందని, రోస్టర్ పాయింట్ల కేటాయింపులోను మాలలకు తీవ్ర నష్టం జరిగేలా సబ్ కమిటీ సభ్యులు కుట్రపూరితంగా చేశారని, 5% కేటాయించిన గ్రూప్ 3లోని మాలలకు, 1% ఉన్న గ్రూప్ 1లోని వారికంటే తక్కువ ఉద్యోగాలు వస్తున్నాయంటే 1% కంటే తక్కువ రిజర్వేషన్ ను మాలలకు కేటాయించారని మండిపడ్డారు.

# వైభవంగా శ్రీ రాధాకృష్ణ కల్యాణోత్సవం

జయభేరి,తుర్కపల్లి, నవంబర్ 10 :



తుర్కపల్లి మండలం వాసాలమర్రి గ్రామ పరిధిలోని రామ్ శెట్టిపల్లిలో శ్రీ రాధాకృష్ణ కళ్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. బావానంద రాధాకృష్ణ మఠం 34వ వార్షికోత్సవం సందర్భంగా మహాత్మ అప్పాల విశ్వనాథ గురుదేవుల దివ్య ఆశీస్సులతో శ్రీ పాండురంగ ఆశ్రమం వారి పర్యవేక్షణలో ఆదివారం ఉదయం గణపతి పూజ, పుణ్యాహవాచనం, గురుపూజ, అభిషేకం, పుష్పార్చన కార్యక్రమం, అఖండ హరే నామ నామ సంకీర్తన, సోమవారం ఉదయం స్వామివారిని ఎదుర్కోలు కార్యక్రమాన్ని నిర్వహించి ఆలయంలో వేద బ్రాహ్మణులు వేదమంత్రోచరణాలతో శ్రీ రాధాకృష్ణ కళ్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారికి ఓడిబియ్యాన్ని సమర్పించి మొక్కలను తీర్చుకున్నారు. అనంతరం అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ పాండురంగ ఆశ్రమ వేద బ్రాహ్మణులు అప్పల సత్యనారాయణ శర్మ, అప్పల విఠల్ శర్మ, అప్పల రసరాజు శర్మ, అప్పల గోపాల శర్మ, రాధాపతి శర్మ, భవానంద శర్మ, నిర్వాహకులు గట్టు బాలయ్య, గట్టు రాజయ్య, గట్టు వెంకటేశం, ప్రణీత్, ప్రణయ్, కొడారి లక్ష్మి నరసయ్య, కొడారి రాములు, రాంబాబు, శ్రీశైలం, శ్రీనివాస్, రాజు, సందీప్, పలుగుల భుజంగం, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# బొడ్డు లక్ష్మయ్య ను పరామర్శించిన కంకణాల




జయభేరి,చింతపల్లి :

చింతపల్లి మండలం వెంకటం పేట (తీదేడు) గ్రామానికి చెందిన బొడ్డు లక్ష్మయ్య ఇటీవల కారు ప్రమాదంలో గాయపడి హస్తినాపురం ఆరుష్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కంకణాల వెంకట్ రెడ్డి,తీదేడు గ్రామ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సోనగంటి గొవర్ధనాచారి, పార్టీ నాయకులు ఉలుపాల శేఖర్ రెడ్డి లు పరామర్శించారు. అనంతరం వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని కోరారు.హాస్పిటల్ లో లక్ష్మయ్య చికిత్స నిమిత్తం సోనగంటి గోవర్ధన్ చారి, ఉలుపాల శేఖర్ రెడ్డి 10,000 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు.కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని వారు అన్నారు.

# కాంగ్రెస్ అధికార దుర్వినియోగం చేస్తోంది

జయభేరి,హైదరాబాద్, నవంబర్ 10:

కాంగ్రెస్ అధికార దుర్వినియోగం చేస్తోందని బిఆర్ఎస్ మాజీ మంత్రి హరీశ్ రావు తెలిపారు. ఎస్ఇసిని బిఆర్ఎస్ నేతలు కలిసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సమస్యాత్మక కేంద్రాల వద్ద బలగాలను పెంచాలని విజ్ఞప్తి చేశామని అన్నారు. మిక్సీలు, గ్రైండర్లు, చీరలు పంచుతున్నారని, మంగళవారం పోలింగ్ లో దొంగఓట్లు పడే అవకాశం ఉందని హరీశ్ రావు తెలియజేశారు. జూబ్లీహిల్స్ లో మద్యం ఏరులై పారుతోందని, ఫేక్ ఓటర్ ఐడిలు పంచుతున్నారని విమర్శించారు. ఇసికి వీడియో ఆధారాలతో ఫిర్యాదు చేశామని, కాంగ్రెస్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుందని హరీశ్ రావు మండిపడ్డారు.

# ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను వెంటనే చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ కె. హైమావతి

జయభేరి,సిద్దిపేట:



సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయం లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి తమ సమస్యల జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ లతో కలిసి జిల్లా కలెక్టర్ కె. హైమావతి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలు తమ సమస్యలు పరిష్కారం అవుతాయని నమ్మకంతో ప్రజావాణి కార్యక్రమానికి వచ్చేసి అందజేసిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి అర్హతల మేరకు వెంటనే పరిష్కరించే దిశగా అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. జిల్లాలో పరిష్కారం కోసం వచ్చేసిన ప్రజల నుండి మొత్తం 200 దరఖాస్తులు తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ నాగ రాజమ్మ, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# చోల్లేటి భాస్కరాచారికి ఘన సన్మానం



జయభేరి,దేవరకొండ :

దేవరకొండ పట్టణంలోని స్థానిక టీటీడీ కళ్యాణ మండపంలో గౌరవ డాక్టరేట్ పొందినటువంటి సామాజిక ఉద్యమకారుడు డాక్టర్ చోల్లేటి భాస్కరాచారి గత 40 సంవత్సరాలనుండి వివిధ రంగాలలో విశిష్ట సేవలు అందించినందుకు గాను అదేవిదంగా సేవలను అందించినందుకు గాను అరుదైన గౌరవం దేవరకొండ వాసులకు దక్కడం గర్వకారణమని బీసీ సంక్షేమ సంఘం నాయకులు కొనియాడారు. బీసీ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

# లావుడి భాషా నాయక్ కి ఘన సన్మానం




జయభేరి,దేవరకొండ :

దేవరకొండ పట్టణంలోని స్థానిక టీటీడీ కళ్యాణ మండపంలో గౌరవ డాక్టరేట్ పొందినటువంటి సామాజిక లావుడి బాషా చౌహాన్ నాయక్ గత 25 సంవత్సరాలనుండి తన సేవలను అందించినందుకు గాను అరుదైన గౌరవం దేవరకొండ వాసులకు దక్కడం గర్వకారణమని బీసీ సంక్షేమ సంఘం నాయకులు కొనియాడారు. బీసీ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేసినారు.



## పరవాడ గ్రామ సమస్యలపై వినతిపత్రం అందజేసిన పైలా

జయభేరి, పరవాడ :

మండల కేంద్రమైన పరవాడలో ఉన్న పలు సమస్యలపై సోమవారం పరవాడ ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ లో టిడిపి అధికార ప్రతినిధి పైల రామచంద్రరావు పెందుర్తి నియోజకవర్గం ఇంచార్జ్ గండి బాబ్జికి వినతి పత్రం అందజేశారు.. సమస్యల్లో ముఖ్యంగా పరవాడ గ్రామంలో భూమిల రీ సర్వే పూర్తి చేయాలని కోరారు. అదేవిధంగా ఫార్మసిటి నుండి మల్లోడు కాలవ మీదుగా పెద్ద చెరువుకు వచ్చే పొల్యూషన్ ను పూర్తిస్థాయిలో అరికట్టి పూర్తిస్థాయిలో శాశ్వత పరిష్కారం చూడాలని ఈ సందర్భంగా టిడిపి అధికార ప్రతినిధి పైల రామచంద్రరావు కోరారు.. ఈ కార్యక్రమంలో మండలము గల నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు..


## పరవాడ శివాలయంలో ఘనంగా కార్తీకమాస అన్నసమారాధన కార్యక్రమం



జయభేరి, పరవాడ:

పరవాడ గ్రామంలో కార్తీక మాసం మూడోవ సోమవారం శుభ సందర్భంగా భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారి ఆలయం లో భక్తులు,దాతల సహకారంతో అన్నసమారాధన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.మూడవ కార్తీకమాస సోమవారం సందర్భంగా వై.సి.పి రాష్ట్ర కార్యదర్శి, పైల శ్రీనివాసరావు, మండల ఎంపీపీ పైల వెంకట పద్మ లక్ష్మీ దంపతులు, పరవాడ సర్పంచ్ ఎస్ ఏ నాయుడు దంపతులు, మాజీ సర్పంచ్ చుక్క రాము నాయుడు దంపతులు ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొని శివయ్య ఆసిస్సులు పొందారు.తదనంతరం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అన్నసమారాధన కార్యక్రమంలోపాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో పరవాడ మండల జనసేన ఇంచార్జి పంచకర్ల ప్రసాద్, జనసేన నాయకులు రెడ్డి శ్రీనివాసరావు వార్డు మెంబెర్లు గండి ఈశ్వరావు,పోతల అప్పలనాయుడు, పైల హరీష్, బొద్దపు అయ్య బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీలో పేలుడూ దృష్ట్యా పోలీస్ శాఖ వాహన తనిఖీలు



జయభేరి, పరవాడ :

ఢిల్లీ బ్లాస్ట్ ఘటన దృష్ట్యా ప్రజల భద్రత నిమిత్తం పరవాడ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆర్. మల్లికార్జున రావు ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి లంకెలపాలెం హైవే వద్ద ఐఓసీ బంక్ సమీపంలో వాహన తనిఖీలు కఠినంగా నిర్వహించారు.విశాఖపట్నం నగర దిశగా వెళ్తున్న ప్రతి వాహనాన్ని సమగ్రంగా తనిఖీ చేశారు అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు లేదా వాహనాలు నగరంలోకి ప్రవేశించకుండా తనిఖీలు నిర్వహించారు.ఈ తనిఖీలు పూర్తిగా ప్రజల భద్రత కోసం చేపట్టిన ముందస్తు జాగ్రత్త చర్యలు మాత్రమే. అందువల్ల ప్రజలు పోలీసులకు సహకరించి భద్రతా చర్యల పట్ల సహకారం అందించాలని ఈ సందర్భంగా పోలీస్ శాఖ కోరింది.

## అయ్యప్పా స్వామిల ఆధ్వర్యంలో ప్రసాద వితరణ




జయభేరి, పరవాడ:

కార్తీకమాసం మూడవ సోమవారం సందర్భంగా పరవాడ శివాలయం వద్ద అఖిల భారత అయ్యప్పా సేవా సంఘం పీఠం స్వామిలచే ఉచిత ప్రసాదం వితరణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయంకు వచ్చిన భక్తుల అందరికి శివ ప్రసాదం అందే విధంగా పీఠం స్వామిలు ఆసక్తి చూపారు.ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించిన్నందుకు ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ధన్యవాదములు తెలియజేసారు.ఈ కార్యక్రమం ముందుగా బండారు శ్రీను గురుస్వామి,చీపురుపల్లి సన్యాసిరావు గురు స్వామిళ్లు,గండి అప్పారావు గురు స్వామిళ్లు,గండి ఈశ్వర్ రావు గురు స్వామిలు పాల్గోని మొదలు పెట్టారు.ఈ కార్యక్రమంలో చుక్కా రవి కుమార్,రెడ్డి ప్రశాంత్,చీపురుపల్లి ప్రశాంత్,దినిష్, కే గోపికృష్ణ, గెడ్డంసాయి, ఢిల్లేశ్వరారావు, చింతల సతీష్, లాలం దినేష్,రాజు,కాకినాడ రంజిత్,చుక్కా లోకేష్,భరత్ తదితర స్వామిలు పాల్గొన్నారు.

# పాటలతో ప్రజల్లో చైతన్యం రగిల్చిన అందెశ్రీ

- ప్రజాకవి, సినీ గేయ రచయిత అందెశ్రీకి జోహార్లు మాల మహానాడు దేవరకొండ నియోజకవర్గం అధ్యక్షులు బోయిని చంద్రమౌళి
- పాటలతో ప్రజల్లో చైతన్యం రగిల్చిన అందెశ్రీ

జయభేరి, దేవరకొండ :





ప్రజా కవి, సినిమా పాటల రచయిత, తెలంగాణ రాష్ట్ర గీతం జయ జయహే తెలంగాణ రాసిన అందెశ్రీ (64) ఇక లేరు. ఆయన సోమవారం ఉదయం కన్నుమూశారు. ఆదివారం ఇంట్లో అస్వస్థతకు గురైన ఆయన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈ ఉదయం తుదిశ్వాస విడిచారు. అందెశ్రీ మృతి పట్ల తెలంగాణ సమాజం తీవ్రం దిగ్భ్రాంతికి గురయ్యింది. ఆయన మరణం తెలంగాణ సాహిత్యానికి, తెలంగాణ పాటకి తీరని లోటని సంతాపం వ్యక్తం చేశారు. అందెశ్రీ అనేక విప్లవాత్మక, అభ్యుదయ పాటలను రాశారు. తెలంగాణ కవిగా పాపులర్ అయ్యారు. తెలంగాణ రచనకు సంబంధించి విశేష సేవలందించారు. 2006లో గంగ అనే సినిమాకి గానూ నంది అవార్డుని అందుకున్నారు. వీటితోపాటు 2014లో అకాడమి ఆఫ్ యూనివర్సల్ గ్లోబల్ పీస్ డాక్టరేట్‌ని పొందారు. 2015లో దాశరథి సాహితి పురస్కారం దక్కించుకున్నారు. అలాగే అదే ఏడాది రావూరి భరద్వాజ సాహితి పురస్కారం దక్కింది. ఆర్ నారాయణ మూర్తి తీసిన అనేక చిత్రాలకు అందెశ్రీ పాటలు రాయడం విశేషం. తన పాటలతో ప్రజలను చైతన్యం చేయడంలో అందె శ్రీది పైచేయి చెప్పొచ్చు. తెలంగాణ ఉద్యమంలోనూ ఆయన పాటలు ఉగ్రూతలూగించాయి. ఉద్యమం సక్సెస్ కావడంతో ఆయన పాటలు కీలక పాత్ర పోషించాయి. ప్రజాకవిగా, ప్రకృతికవిగా, అభ్యుదయ రచయితగా సుప్రసిద్ధులైన అందెశ్రీ వరంగల్ జిల్లా జనగామ వద్ద గల రేబర్తి అనే గ్రామంలో 18 జూలై,1961 జన్మించారు. ఈయన అసలు పేరు అందె ఎల్లయ్య. ఒక అనాధగా పెరిగారు. పెద్దగా చదువు లేదు. కాయకష్టం చేస్తూ తన పనిలోనే సాహిత్యాన్ని వెతుక్కున్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం నుండి గౌరవ డాక్టరేట్ పొందారు. మొదట్లో అందెశ్రీ గొర్రెల కాపరిగా పని చేశారు. అందెశ్రీ పాటలు పాడటం శృంగేరి మఠానికి సంబంధించిన స్వామీ శంకర్ మహారాజ్ విని చేరదీసాడు. ఆయన ప్రోత్సాహంతో గొప్ప కవిగా, రచయితగా ఎదిగారు. రాష్ట్రవ్యాప్తంగా ఈయన పాటలు బాగా పాపులర్ అయ్యాయి. ఆర్ నారాయణ మూర్తి ద్వారా వచ్చిన విప్లవాత్మక సినిమాల విజయం వెనుక ఈ పాటలున్నాయి. ఎంతో పాపులర్ పాటలను అందెశ్రీ రాసినవే. తెలంగాణ, ప్రకృతి లాంటి అంశాలపై ఆయన గేయరచన చేశారు. ఎర్ర సముద్రం సినిమా కోసం రచించిన మాయమైపోతుండమ్మా మనిషన్న వాడు ఆంధ్రప్రదేశ్ లోని విశ్వవిద్యాలయాల తెలుగు విషయం రెండో సంవత్సరం సిలబస్ లో చేర్చారు. కాకతీయ విశ్వవిద్యాలయం ఈయనకు గౌరవ డాక్టరేట్ అందించింది. అంతేకాదు బతుకమ్మ సినిమా కోసం డైలాగ్స్ కూడా రాశారు. జయజయహే తెలంగాణ జననీ జయకేతనం (తెలంగాణ గీతం), పల్లెనీకు వందనములమ్మో, మాయమైపోతున్నాడమ్మా మనిషన్నవాడు, గలగల గజ్జెలబండి, కొమ్మ చెక్కితే బొమ్మరా... కొలిచి మొక్కితే అమ్మరా, జన జాతరలో మన గీతం యెల్లిపోతున్నావా తల్లి, చూడ చక్కని తల్లి వంటి పాటలు బాగా పాపులర్ అయ్యాయి. వీటితోపాటు అనేక పాటలను ఆయన రాశారు. అలాగే రైటర్‌గా ఆయన అనేక పురస్కారాలు సొంతం చేసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ ఏడాది జూన్ 2న తెలంగాణ రాష్ట్రa ఆవిర్భావం సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా కోటి నగదు పురస్కారం అందుకున్నారు. అందెశ్రీ మరణం తెలంగాణ సాహిత్యానికి తీరని లోటని ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ ఆకస్మిక మృతి పట్ల మాల మహానాడు దేవరకొండ నియోజక వర్గం అధ్యక్షులు బోయిని చంద్రమౌళి తీవ్ర దిగ్భ్రాంతి చెందారు. తెలంగాణ రాష్ట్ర గీతం జయ జయహే తెలంగాణను రాసిన అందెశ్రీ మరణం తెలంగాణ సాహితీ లోకానికి తీరని లోటని ఆయన అన్నారు. తెలంగాణ ఉద్యమంలో, తెలంగాణ రాష్ట్ర సాధనలో జయ జయహేu తెలంగాణ గేయం కోట్లాది ప్రజల గొంతుకై నిలిచిందని గుర్తు చేశారు. ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర గీతం కొత్త స్వరాలతో రూపకల్పన చేసుకున్నామని తెలంగాణ సాహితీ శిఖరం నేల కూలిందంటూ ఆయన మరణం పట్ల మలమానుడు దేవరకొండ నియోజకవర్గం అధ్యక్షులు బోయిని చంద్రమౌళి తన సంతాపాన్ని వ్యక్తం చేశారు. స్వరాష్ట్ర సాధనలో, జాతిని జాగృతం చేయడంలో ఆయన చేసిన కృషి చిరస్థాయిగా నిలిచి ఉంటుందన్నారు. అందెశ్రీ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని తెలంగాణ ఉద్యమ గీతాల బతికే ఉంటారన్నారు.

# సాహితి లోకానికి తీరని లోటు

జయభేరి, గార్ల, నవంబర్ 10:



మలిదశ ఉద్యమ కెరటమై రాష్ట్ర సాధన ఆకాంక్షను కోట్లాది ప్రజల గుండెల్లో బలంగా నిలిపిన చారిత్రక గీతాన్ని అందించిన అందెశ్రీ మరణం తెలంగాణ సమాజానికి,సాహితి లోకానికి ఎప్పటికీ పూడ్చలేని లోటని మలిదశ తెలంగాణ ఉద్యమకారులు వజ్రం నాగేశ్వరరావు,జంపాల విశ్వ, గిన్నారపు మురళి తారక రామారావు,మాలోత్ సురేష్ లు అన్నారు. కవి,రచయిత, గాయకులు అందెశ్రీ ని స్మరిస్తూ మలిదశ తెలంగాణ ఉద్యమకారుల ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రం లోని స్థానిక తెలంగాణ అమరవీరుల స్థూపం ఎదుట కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా మలిదశ ఉద్యమకారులు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సాగిన సాంస్కృతిక ఉద్యమంలో కవిగా తన పాటలతో, సాహిత్యంతో కీలక పాత్ర పోషించారని తెలిపారు. జయ జయహే తెలంగాణ గీతం ద్వారా అందెశ్రీ తెలంగాణ చరిత్రలో చిరస్మరణీయులుగా నిలిచిపోతారని అన్నారు. ఈ సందర్భంగా ప్రజలు, ఉద్యమకారులు పెద్ద ఎత్తున తరలివచ్చి అందెశ్రీకి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కట్టెబోయిన శ్రీనివాస్, జంపాల వెంకన్న, తాళ్లపల్లి కృష్ణా గౌడ్, రామకృష్ణ, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# భక్తులకు మెరుగైన వసతులు కల్పించాలి

- యాదగిరిగుట్ట ఆలయ ఈవో వెంకట్ రావు

జయభేరి, యాదగిరిగుట్ట :





యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థానంలోని వివిధ విభాగాలను ఆలయ ఈవో వెంకట్ రావు సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించి,భక్తుల సౌకర్యం కోసం కొనసాగుతున్న వివిధ కార్యక్రమాలు,సేవలను సమీక్షించారు. ప్రోటోకాల్ విభాగంలో ఆకస్మిక తనిఖీ నిర్వహించి,ప్రోటోకాల్ వ్యక్తులకు అందజేస్తున్న సౌకర్యాల విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రోటోకాల్ సౌకర్యాలు వినియోగించే వ్యక్తుల సంఖ్యను పరిమితం చేయాలని, సాధారణ భక్తులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. అలాగే ప్రతి మంగళవారం, శనివారం భక్తుల కోసం ఉచిత దర్శన పథకం కింద స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో వస్తున్న దృష్ట్యా,వారికి మరింత సౌకర్యం కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

### శివాలయంలో ప్రసాద వితరణ కార్యక్రమం ప్రారంభం

భక్తుల సౌకర్యార్థం కోసం ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఆలయ ఈవో వెంకట్ రావు ప్రారంభించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రతి సోమవారం శివాలయంలో భక్తులకు ప్రసాదం పంపిణీ చేయనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా ఆలయ భక్తులకు ఆధ్యాత్మిక ఆనందం కలిగేలా,అలాగే దేవస్థానం సేవా కార్యక్రమాలకు మరింత దగ్గరగా భాగస్వామ్యం అయ్యేలా అవకాశం కల్పించబడుతుందని యాదగిరిగుట్ట ఆలయ ఈవో వెంకట్ రావు వెల్లడించారు. ప్రసాదం తయారీ విభాగాన్ని సందర్శించి,ఉపయోగిస్తున్న పదార్థాల నాణ్యత, పరిశుభ్రత, వంటశాల నిర్వహణ, ప్యాకేజింగ్ మొదలైన అంశాలను సవివరంగా పరిశీలించారు. భక్తులకు అందించే ప్రసాదం రుచికరంగా, నాణ్యతతో, పవిత్రతతో ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు. అనంతరం టికెట్ కౌంటర్లను పరిశీలించి, అక్కడి సిబ్బంది పనితీరును పరిశీలించారు. కియోస్క్ యంత్రాల పనితీరును ప్రత్యక్షంగా పరిశీలించారు. భక్తులతో మాట్లాడగా, ఇట్టి కియోస్క్ వాడకం వల్ల క్యూ లైన్లలో వేచిచూసే సమయం గణనీయంగా తగ్గిందని, త్వరితగతిన సేవలు అందుతున్నాయని భక్తులు సంతృప్తిని వ్యక్తపరిచారు.



### పాతగుట్ట ఆలయ సందర్శించిన ఈవో వెంకట్ రావు

అనంతరం పాతగుట్ట ఆలయాన్ని సందర్శించి, అక్కడి నిర్మాణాలు, భక్తుల సౌకర్యాలు ,అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పైకప్పు మరమ్మత్తులు, చిన్నపాటి పనులు తక్షణమే చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అదే విధంగా పలు పనులను పాతగుట్ట ఆలయంలో ప్రారంభించేందుకు ఆమోదం తెలిపారు. ఇందులో భాగంగా కొత్త అద్దాల మండపం నిర్మాణం, ఆంజనేయ స్వామి ఆలయం పునరుద్ధరణ, గుండం, ఆంజనేయ స్వామి ఆలయానికి వెళ్లే మెట్ల వద్ద రైలింగులు, షెడ్ ఏర్పాటు, ఆలయ పరిసర ప్రాంతంలో కాంపౌండ్ గోడ, సంబంధిత సౌకర్యాల నిర్మాణాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఈ దయాకర్ రెడ్డి. ఏఈవోలు గజవెల్లి రఘు, నవీన్, మహేష్, ఎస్పీఎఫ్ ఆర్ఐ శేషగిరిరావు,ఆలయ సూపరింటెండెంట్ రాజన్ బాబు తదితరులు ఉన్నారు.



## సిద్దిపేట మెడికల్ కాలేజీలో 83కు చేరిన పీజీ సీట్లు

- మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు

జయభేరి, సిద్దిపేట:

కొత్తగా రేడియాలజీ, ఆర్థోపెడిక్ విభాగాల్లో 8 పీజీ సీట్లు మంజూరు అనతి కాలంలోనే 18 స్పెషాలిటీలలో పీజీ కోర్సులు ఉస్మానియా, గాంధీ, వరంగల్ కాకతీయ మెడికల్ కాలేజీల స్థాయిలో సిద్దిపేట వైద్య కాలేజీ సంతోషం వ్యక్తం చేసిన మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు సిద్దిపేట ప్రభుత్వ వైద్య కళాశాల జిఎంసి,కు మరో 8 పీజీ సీట్లు మంజూరు అయినట్లు మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. బి ఆర్ ఎస్ ప్రభుత్వం లో సిద్దిపేట లో మెడికల్ కళాశాల మంజూరు చేసుకున్నామని ప్రారంభం చేసుకున్న తొలి నాళ్ళలోనే వైద్య కళాశాలలో పీజీ వైద్య విద్య కూడా ప్రారంభం చేసుకున్నామని చెప్పారు.. మొదట్లో 13 సీట్లతో పీజీ విద్య ప్రారంభం చేసుకోగ అన్ని స్పెషాలిటి కోర్స్ లు ఏర్పాటు చేయాలనీ ఉద్దేశ్యం తో సంవత్సరానికి కొన్ని కోర్స్ తెచ్చుకుంటున్నామని చెప్పారు. కొత్తగా రేడియాలజీ లో 4 సీట్లు, ఆర్థోపెడిక్ లో 4 సీట్లు మంజూరు చేసుకున్నామని ఇప్పటికి 75 పీజీ సీట్లు ఉండగా ఈ 8 సీట్ల తో 83 కు పెరిగియాన్నారు. దీనితో 18 స్పెషాలిటి లలో పీజీ కోర్స్ లు ఉన్నాయని, ఇది రాష్ట్రం లోని ఉస్మానియా, గాంధీ, వరంగల్ లోని కాకతీయ వైద్య కళాశాల తరువాత సిద్దిపేట ప్రభుత్వ వైద్య కళాశాల లోనే అత్యధిక పీజీ కోర్స్ ఉన్నాయని సంతోషం వ్యక్తం చేశారు.. సిద్దిపేట లో వైద్య విద్య పూర్తి చేసి ఇక్కడే పీజీ కోర్స్ కూడా పూర్తి చేయాలనే లక్ష్యం తో సిద్దిపేట వైద్య కళాశాల మరింత ముందుకు పోతుందని అన్ని వసతులతో, విద్యార్థుల కు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కళాశాల ను ఏర్పాటు చేసుకున్నామని చెప్పారు.. ఎం బి బి ఎస్ పూర్తి చేసిన విద్యార్థుల ఈ విద్యాసంవత్సరం నుండి సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అనతి కాలంలోనే సిద్దిపేట వైద్య కళాశాలకు 18 స్పెషాలిటీలలో పీజీ కోర్సులు ఉస్మానియా, గాంధీ, వరంగల్ కాకతీయ మెడికల్ కాలేజీల స్థాయిలో సిద్దిపేట వైద్య కాలేజీ ఫలిస్తున్న హరీష్ రావు ప్రయత్నం. సిద్దిపేట వైద్య కళాశాల ఏర్పాటు అయిన అనతి కాలంలోనే 18 స్పెషాలిటి పీజీ కోర్సు లు ఏర్పాటు కావడం ఉస్మానియా, గాంధీ, కాకతీయ వైద్య కళాశాల స్థాయి లో సిద్దిపేట కళాశాల చేరింది.. మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు గారి ముందు చూపు ఆలోచన ఫలిస్తుంది. కళాశాల ప్రారంభం నుండే హరీష్ రావు గారు మంత్రి గా ఉండి పీజీ కోర్స్ తీసుకొచ్చారు. సిద్దిపేట లో మెడిసిన్ చదివిన విద్యార్థి, సిద్దిపేట లోనే పీజీ చేయాలి, అదేవిదంగా పేద విద్యార్థుల కు పూర్తి స్థాయి వైద్య విద్య అందాలని హరీష్ రావు గారు ముందు చూపుతో పీజీ కోర్స్ లు సీట్లు తీసుకొచ్చారు.. దానికి అనుగుణంగా కొత్తగా 8 సీట్లు మంజూరు తో రెండు కోర్స్ లు రావడం తో 18 స్పెషాలిటి పీజీ కోర్స్ లు పెరిగి రాష్ట్ర స్థాయి ప్రభుత్వ వైద్య కళాశాల స్థాయి లో సిద్దిపేట వైద్య కళాశాల కు దక్కింది.

# మనం ఐక్యతే మన బలం




- ఘనంగా గోపా 44వ వానభోజనాల కార్యక్రమ నిర్వహణ

**జయభేరి, హైదరాబాద్ :**

ఎంతో పవిత్రమైన కార్తీకమాసంలో గౌడ్ జన వన సమారాధన (వన భోజనాలు) ప్రకృతి ఒడిలో జరుపుకొవడం ఆనవాయితీ. ప్రకృతి ప్రేమికులు, కుల సంబంధాలతో ముడిపడిన మానవ సంబంధాలు, ప్రకృతి ఒడిలో సేద దీరడానికి అవకాశం కల్పించిన అత్యంత ముఖ్యమైన పవిత్రమైన ఈ కార్తీకమాసం అందరి కలయిక, పరిచయం మరియు పరస్పర సహకారంతో నగరాలు, పట్టణాలు మరియు గ్రామాలు అనే భేద భావం పోగొట్టడానికి ఉపయోగపడే వేదిక అని చెప్పవచ్చు. ఇలాంటి వేదికలు గౌడ్ కుటుంబ సభ్యులందరిని ఆహ్లాదపరుస్తూ, నూతన ఉత్తేజాన్ని కలిగిస్తుందని చెప్పడంలో అతిశయోక్తి లేదు.






మానవ మనుగడ ప్రకృతితొ ముడిపడి ఉన్నది మరియు ముఖ్యంగా గౌడ్ బిడ్డలందరు ప్రకృతి ప్రేమికులే కాబట్టి ఒక్క రోజైన గౌడ్ కుటుంబాలు ప్రకృతిలొ సేద తీరడానికి అవకాశం ఉన్న ఈ కార్తీకమాసంలొ తెలంగాణ రాష్ట్ర గోపా కమిటీ అధ్వర్యంలో నిరంతరంగా గోపా వన భోజనాలు జరుగుతున్నాయి.

ఈ నిరంతర నిర్వహణలొ భాగంగా ఈ నెల 911 2025 ఆదివారం హైదరాబాద్ లోని సంజీవయ్య పార్క్ లో తెలంగాణ రాష్ట్ర గోపా అధ్వర్యంలో వన భోజనాలు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గౌడ కులానికి చెందిన ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు, వివిధ రంగాల్లోని వృత్తి నిపుణులు (ప్రొఫెషనల్స్) పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వివిధ జిల్లా శాఖల గోపా జీవిత సభ్యులు కూడా వారి కుటుంబాలతో హాజరై ఆట పాటలతో ఆనందో త్సాహలతో ప్రకృతిలో సేద తీరారు. గోపా రాష్ట్ర అధ్యక్షులు డా. బండి సాయన్న గౌడ్, ప్రధాన కార్యదర్శి జి. వి. శ్రీనివాస్ గౌడ్, కోశాధికారి మొగిలి రఘునాథ్ గౌడ్ హాజరైన గోపా సభ్యులను ఉద్దేశించి ప్రసంగించారు. గోపా ఉపాధ్యక్షులు, ఆర్గానైజింగ్ కార్యదర్శులు, సంయుక్త కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. వివిధ జిల్లాల గోపా అధ్యక్షులు వారి కార్యవర్గాన్ని అందరికీ పరిచయం చేశారు. ఈ సందర్భంగా అందరూ ఐక్యత, సంబంధాల ఆవశ్యకతకు ప్రధాన్యమివ్వాలని తీర్మానించారు. అనంతరం డిసెంబర్ 28న జరగనున్న గోపా 50 సంవత్సరాల పండుగ పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. ఈ స్వర్ణ ఉత్సవా త్సవలను కూడా విజయవంతం చేయాలని కోరారు.




## యాదగిరిగుట్ట లాడ్జిల్లో పోలీసుల తనిఖీలు

**జయభేరి, యాదగిరిగుట్ట, నవంబర్ 10:**

యాదగిరిగుట్ట పట్టణంలోని పలు లాడ్జిలలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. సోమవారం యాదగిరిగుట్ట పట్టణ సీఐ భాస్కర్ ఆధ్వర్యంలో పోలీసులు బృందాలు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా లాడ్జిలో రికార్డులను పరిశీలించారు. నిబంధనలు పాటించని పాతగుట్టలోని శ్రీసాయి ఫ్యామిలీ రూమ్స్ లాడ్జిపై కేసు నమోదు చేసినట్లు సీఐ బాస్కర్ తెలిపారు. పోలీసులు ఇచ్చిన సూచనల ప్రకారం లాడ్జిలు నడపాలని, లేదంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి లాడ్జిలకు వచ్చే వారి వివరాలతో రికార్డులు మెయిటేన్ చేయాలని, ల్లాడిల్లో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పన్నారు. తనిఖీల్లో ఎస్సై రూప,పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఆర్యవైశ్య సేవ సమితి ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణ వ్రత పూజలు



**జయభేరి, యాదగిరిగుట్ట నవంబర్ 10:**

కార్తీకమాసాన్ని పురస్కరించుకొని యాదగిరిగుట్ట ఆర్యవైశ్య సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీసత్యనారాయణ వ్రతాలు, దీపోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సోమవారం ఆర్యవైశ్య సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక వ్రత పూజలు సురేంద్రపురి పక్కనే ఉన్న ఆర్యవైశ్య సత్రంలో సామూహిక శ్రీసత్యనారాయణస్వామి వ్రతపూజలు,కార్తీక దీపోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించారు. కార్తీకమాసంలో దీపోత్సవం, శ్రీసత్యనారాయణ వ్రత పూజలను నిర్వహించడం ఆనవాయిగా కొనసాగుతుందని,అందులో భాగంగానే ఆర్యవైశ్య సేవా సమితి ఆధ్వర్యంలో వ్రత పూజలు, దీపోత్సవాన్ని నిర్వహించినట్లు తెలిపారు. పూజా మహోత్సవంలో పాల్గోన్న తడ్క వెంకటేష్, బెజుగం వెంకటనర్సయ్య, బెజుగం శివకుమార్ దంపతులతో పాటు సత్రం సిబ్బంది ప్రతాప్,బనారస్ తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి అక్రమ రవాణాపై కఠిన చర్యలు

- 32 కిలోల గంజాయి, వాహనం స్వాధీనం
- సినీ ఫక్కిలో గంజా అక్రమ రవాణాలను ఛేదించిన పోలీసులు.



**జయభేరి, తిరుపతి:**

సినీ ఫక్కిలో జరిగిన గంజా అక్రమ రవాణాలను చంద్రగిరి పోలీసులు చాకచక్యంగా ఛేదించారు . ఈ వివరాలను తిరుపతి జిల్లా ఎస్పి ఎల్. సుబ్బరాయుడు, సోమవారం మీడియా సమావేశంలో వెల్లడించారు. గంజాయి అక్రమ రవాణాపై సమాచారం అందడంతో, చంద్రగిరి డిఎస్పీ ప్రసాద్, పాకాల సిఐ మరియు చంద్రగిరి ఏం.ఆర్.ఓ, చంద్రగిరి సీఐ ఎం. సురేష్ కుమార్, ఆర్సి పురం ఎస్ఐ ఎం. భక్తవత్సలం, చంద్రగిరి ఎస్ఐ వై. అనిత బృందం ఆదివారం మధ్యాహ్నం తిరుపతి నాయుడుపేట జాతీయ రహదారి (NH140) తువ్వ చేనుపల్లి గ్రామ సమీపంలో ప్రత్యేక తనిఖీలు చేపట్టింది. ఒరిస్సా నుండి తమిళనాడు రాష్ట్రానికి చెందిన పొన్ను స్వామి సెల్వరాజ్ గంజాయి అక్రమ రవాణాను సినీ పక్కిలో తరలిస్తుండగా చంద్రగిరి పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. ముద్దాయి తరలిస్తున్న కారులో సాదారణ తనికీ చేయగా ఏ విధమైన గంజాయి కనబడలేదు. అనుమానంతో పోలీస్ జాగిలం సహాయంతో తనికీ చేయగా జాగిలం కారులో డాష్ బోర్డు, గేర్ బాక్స్, టైర్ స్టెప్ భాగంలోఉన్నట్టు కనిపెట్టింది. మరింత తనిఖీ చేయగా వాహనంలో దాచిన 27 ప్యాకెట్ల గంజాయి మొత్తం 32.730 కిలోలు దొరికాయి. రి వాహనం నడుపుతున్న పొన్నుస్వామి సెల్వరాజ్ ను ఆరెస్ట్ చేశారు. వాహనంలో దొరికిన గంజాయి, రెండు మొబైల్ ఫోన్లు, వాహనాన్ని స్వాధీనం చేసుకొని, మొత్తం సుమారు రూ. 6 లక్షల విలువైన సొత్తును జప్తు చేశారు.



## పవన్ ను ప్రశంసించిన చంద్రబాబు

- కేబినెట్ సమావేశంలో 70 అంశాలపై చర్చ

**జయభేరి, విజయవాడ, నవంబర్ 10:**

ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ సమావేశంలో డిప్యూటీ సీఎం, అటవీ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ పనితీరుపై ముఖ్యమంత్రి చంద్రబాబు, సహచర మంత్రులు ప్రశంసలు కురిపించారు. పవన్ పనితీరు ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉందని అభినందించారు. సోమవారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన అమరావతిలో జరిగిన క్యాబినెట్ భేటీలో ఈ ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. ఇటీవల మామండూరు అటవీ ప్రాంతంతో పాటు మంగళంలోని ఎర్ర చందనం డిపోను సందర్శించిన వివరాలను పవన్ కల్యాణ్ నేటి మంత్రివర్గ సమావేశంలో పంచుకున్నారు. వైసీపీ నేత పెద్దిరెడ్డి ఆక్రమణలపై ఆధారాలతో వీడియోలు తీయించానని తెలిపారు. సందర్భంగా ఆయన చొరవను, క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న తీరును సీఎం ప్రత్యేకంగా అభినందించారు. పట్టుబడిన ఎర్రచందనం దుంగలతో ఏవైనా పరికరాలు చేద్దామని చంద్రబాబు ప్రతిపాదించారు.సోమవారం సుమారు మూడున్నర గంటల పాటు సాగిన ఈ సమావేశంలో దాదాపు 70 అజెండా అంశాలపై కూలంకషంగా చర్చించారు. పలు కీలక నిర్ణయాలకు మంత్రివర్గం ఆమోద ముద్ర వేసింది. రాజధాని అమరావతిలో క్వాంటమ్ కంప్యూటింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. అదేవిధంగా, వివిధ సంస్థలకు భూముల కేటాయింపుపై సీఆర్డీఏ తీసుకున్న నిర్ణయాలను కూడా మంత్రివర్గం సమర్థించింది. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహించేందుకు భూ కేటాయింపుల్లో ప్రత్యేక రాయితీలు ఇవ్వాలని నిర్ణయించింది. రెవెన్యూ శాఖలో దీర్ఘకాలంగా ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేందుకు పచ్చజెండా ఊపింది.సమావేశం అనంతరం మంత్రులతో మాట్లాడిన సీఎం చంద్రబాబు, ఇటీవల సంభవించిన మొంథా తుపాను సమయంలో యంత్రాంగం అద్భుతంగా పని చేసిందని కొనియాడారు. మంత్రులు, అధికారులు క్షేత్రస్థాయిలో ఉండి ప్రజలకు అండగా నిలవడం వల్లే నష్టాన్ని తగ్గించగలిగామని తెలిపారు. రియల్ టైమ్ గవర్నెన్స్ సిస్టమ్ (ఆర్టీజీఎస్) ద్వారా నిరంతరం పర్యవేక్షించడం సత్ఫలితాలనిచ్చిందని అన్నారు. సమన్వయంతో పనిచేస్తేనే ఉత్తమ ఫలితాలు వస్తాయని, ఆ స్ఫూర్తిని కొనసాగించాలని సూచించారు.ఈ సందర్భంగా పేదలందరికీ ఇళ్లు అందించే బాధ్యతను మంత్రులు, ఎమ్మెల్యేలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. నివాస స్థలం లేని వారి జాబితాలను సిద్ధం చేసి, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని, రెవెన్యూ సమస్యల పరిష్కారంలో జాప్యాన్ని నివారించాలని మంత్రులకు దిశానిర్దేశం చేశారు.

## జూబ్లీ ఎన్నికలకు అంతా సిద్ధం




- ఉల్లంఘనలపై ఉక్కుపాదం.. రూ.3.60 కోట్లు స్వాధీనం

**జయభేరి, హైదరాబాద్, నవంబర్ 10:**

జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉపఎన్నికను ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి ఆర్వీ కర్ణన్ తెలిపారు. నియోజకవర్గంలోని సగానికి పైగా పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించి, అసాధారణ భద్రతా ఏర్పా ట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. ఎన్నికల ఏర్పాట్లు, భద్రతా చర్యలు, ఓటర్లకు కల్పిస్తున్న సౌకర్యాల గురించి సమగ్రంగా వివరించారు. జూబ్లీహిల్స్ నియోజక వర్గంలో మొత్తం 4,01,365 మంది ఓటర్లు ఉన్నారని, వీరిలో పురుషులు 2,08,561 మంది, మహిళలు 1,92,779 మంది, ఇతరులు 25 మంది ఉన్నారని కర్ణన్ తెలిపారు.

వీరిలో 1,908 మంది దివ్యాంగ ఓటర్లు, 85 ఏళ్లు పైబడిన వారు 2,134 మంది, 1819 ఏళ్ల మధ్య వయసున్న యువ ఓటర్లు 6,859 మంది ఉన్నారని వివరించారు.ఓటర్ల సౌకర్యార్థం 139 భవనాల్లో మొత్తం 407 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. శాంతిభద్రతల దృష్ట్యా, వీటిలో 226 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక క్రిటికల్ కేంద్రాలుగా గుర్తించి, అక్కడ కేంద్ర బలగాలతో సహా అదనపు భద్రతను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. పోలింగ్ ప్రక్రియను డ్రోన్ల ద్వారా కూడా పర్యవేక్షిస్తామని ఆయన స్పష్టం చేశారు.ఈ ఉపఎన్నిక బరిలో మొత్తం 58 మంది అభ్యర్థులు ఉండటంతో, సాంకేతికంగా ప్రతి పోలింగ్ కేంద్రంలో ఒక కంట్రోల్ యూనిట్, ఒక వీవీప్యాట్తో పాటు నాలుగు బ్యాలెట్ యూనిట్లను ఉపయోగిస్తున్నట్లు డీఈఓ తెలిపారు. ఇది ఓటర్లు గమనించాల్సిన కీలకమై న అంశమన్నారు. ఎన్నికల నిర్వహణ కోసం 561 కంట్రోల్ యూనిట్లు, 2,394 బ్యాలెట్ యూనిట్లు, 595 వీవీప్యాట్లను సిద్ధంగా ఉం చామన్నారు. ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తినా స్పందించేందుకు 40 మం ది ఈసీఐఎల్ ఇంజనీర్లను అందుబాటులో ఉంచా మన్నారు. మొత్తం 2,060 మంది పోలింగ్ సిబ్బంది విధుల్లో పాల్గొంటారని చెప్పారు.ప్రశాంత పోలింగ్ కోసం నగర పోలీసులతో పాటు, ఐటీ, ఎక్సైజ్, నార్కోటిక్స్ వంటి వివిధ విభాగాలతో కూడిన జిల్లా ఇంటెలిజెన్స్ కమిటీ నిరంతరం పనిచేస్తోందన్నారు. అన్ని 407 పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలతో పాటు, ఎన్నికల సంఘం నుంచి ప్రత్యక్ష ప్రసారం ద్వారా పర్యవేక్షించేందుకు వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఓటర్ల సహాయార్థం ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద హెల్ప్ డెస్కు, క్యూలైన్లను పర్యవేక్షించేందుకు ఎన్సీసీ వాలంటీర్లు, పోలింగ్ కేంద్రం లోకి ప్రవేశించే ముందు ఓటర్లు తమ మొబై ల్ ఫోన్లను భద్రపరుచుకునేందుకు మొబైల్ డిపాజిట్ కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. దివ్యాంగుల కోసం ర్యాంపులు, వీల్ చైర్లు, రవాణా సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు.


ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఎంసీసీ ఉల్లంఘనలకు సంబంధించి ఇప్పటివరకు 27 కేసులు నమోదు చేశామని, ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వై లెన్స్ బృందాలు కలిసి రూ. 3,60,50,952 విలువైన నగదు, మద్యం, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నాయని కర్ణన్ వెల్లడించారు. ప్రచారం ముగిసిన తర్వాత నియోజకవర్గంలో ఎలాంటి అక్రమాలకు తావివ్వ కుండా నిఘా కొనసాగుతుందన్నారుప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం, పోలింగ్ కేంద్రాలు, కౌంటింగ్ కేంద్రం యూసుఫ్గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యాలయాలు, సంస్థలకు పోలింగ్కు ముందు రోజు నవంబర్ 10, సోమవారం, పోలింగ్ రోజు నవంబర్ 11, మంగళవారం, కౌంటింగ్ రోజు నవంబర్ 14, శుక్రవారం వేతనంతో కూడిన సెలవు దినాలుగా ప్రకటించినట్లు తెలిపారు. ఓటర్లందరూ నిర్భయంగా, ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ముందుకు వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి పిలుపునిచ్చారు.



# శివ సీక్వెల్‌పై నోరు విప్పిన ఆర్జీవీ..

అక్కినేని నాగార్జున హీరోగా, సంచలన దర్శకుడు రామ్ గోపాల్ వర్మ దర్శకత్వంలో వచ్చిన కల్ట్ క్లాసిక్ చిత్రం 'శివ' తెలుగు సినిమా చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచింది. కేవలం బ్లాక్‌బస్టర్ హిట్ మాత్రమే కాకుండా, తెలుగు సినీ పరిశ్రమకు కొత్త దిశ చూపిన మూవీగా గుర్తింపు పొందింది. ఇప్పుడు ఆ లెజెండరీ సినిమా మళ్లీ ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమాకు 36 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా, మేకర్స్ 'శివ'ను నవంబర్ 14న 4K క్వాలిటీలో రీరిలీజ్ చేయడానికి సిద్ధమవుతున్నారు. ఈ సందర్భంగా మూవీ టీమ్ భారీ స్థాయిలో ప్రమోషన్స్ ప్రారంభించింది. తాజాగా నిర్వహించిన మీడియా మీట్‌లో నాగార్జున, దర్శకుడు రామ్ గోపాల్ వర్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇద్దరూ సినిమా అనుభవాలను గుర్తుచేసుకున్నారు. మీడియా సమావేశంలో ఒక జర్నలిస్ట్ ఆసక్తికరమైన ప్రశ్న అడిగాడు .."శివ సినిమాకు సీక్వెల్ చేయాలనుకుంటే, నాగ చైతన్య లేదా అఖిల్‌లో ఎవరిని హీరోగా తీసుకుంటారు?" అని అడగగా , దానికి ఆర్జీవీ తనదైన స్టయిల్లో స్పందిస్తూ.. ఇద్దరు కాదు. శివ అనేది నాగార్జున కోసం చేసిన సినిమా. ఆ పాత్రలో మరోవారిని ఊహించుకోవడం అసాధ్యం అని చెప్పాడు. ఆయన సమాధానం అక్కడ ఉన్న వారిని ఆకట్టుకుంది. అదే సమయంలో రామ్ గోపాల్ వర్మ ప్రస్తుతం వచ్చే సినిమాల ట్రెండ్‌పై కూడా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇప్పటి సినిమాల్లో హీరో టెన్షన్ పడే సన్నివేశాలు తగ్గిపోయాయి. ఇంట్రడక్షన్ సీన్ లేదా సాంగ్‌తోనే అతను సూపర్ హీరోలా చూపిస్తారు. కానీ శివలో హీరో ఒక సాధారణ మనిషి. అందుకే ఆయన హీరోయిజం మరింత ఎలివేట్ అయింది. ప్రేక్షకులు మళ్లీ ఆ భావోద్వేగాన్ని అనుభవిస్తారు అని అన్నారు. ప్రేక్షకులు ఇప్పటికే ఈ రీరిలీజ్‌పై చాలా ఎగ్జైట్‌మెంట్‌గా ఉన్నారు. నవంబర్ 14న 4K ఫార్మాట్‌లో థియేటర్లలో మళ్లీ వినిపించబోతున్న "ఏం జాలిగా..." బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్, క్లాసిక్ యాక్షన్ సన్నివేశాలతో శివ మరోసారి ప్రేక్షకుల గుండెల్లో గర్జించనుంది.

# భర్త మహాశయులకు రామసత్యనారాయణ విజ్ఞప్తి



అగ్ర హీరో రవితేజ కథానాయకుడిగా కిశోర్ తిరుమల దర్శకత్వంలో సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌కు 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' అనే పేరును ఖరారు చేశారు. సోమవారం గ్లింప్స్ ని విడుదల చేశారు. ఈ అనౌన్స్‌మెంట్ గురించి రవితేజ పాత్ర మాట్లాడుతూ 'నా జీవితంలో ఇద్దరు ఆడాళ్లు నన్ను రెండు ప్రశ్నలడిగారు. సమాధానం కోసం చాలా ఆలోచించాను. గూగుల్, ఏఐ అన్నిటినీ అడిగాను. మేబీ.. వాటికి పెళ్లి కాకపోవడం వల్ల నన్నింకా కన్‌ఫ్యూజ్ చేశాయి. అనుభవం ఉన్న మగాళ్లని ముఖ్యంగా మొగుళ్లని అడిగాను. ఆశ్చర్యపోయారే తప్ప ఆన్సర్ మాత్రం ఇవ్వలేకపోయారు. అలాంటి ప్రశ్న మిమ్మల్ని ఏ ఆడాళ్లూ అడక్కూడదని, పళ్లైన వాళ్లకి నాలాంటి పరిస్థితి ఎదురవ్వకూడదని కోరుకుంటూ మీ రామసత్యనారాయణ చెప్పేదేంటంటే.. 'భర్త మహాశయులకు విజ్ఞప్తి..' అంటూ తన పాత్రతో పాటు టైటిల్‌ను కూడా పరిచయం చేశారు రవితేజ. ఈ చిత్రం సంక్రాంతి కానుకగా విడుదల కానున్నది. ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్ సిసిరోలియో.



# హీరోయిన్లను మించిన అందం..


ప్రస్తుతం ఆమె వయసు 45 సంవత్సరాలు. ఇప్పటికీ ఏమాత్రం తరగని అందంతో కుర్ర హీరోయిన్లకు గట్టిపోటీనిస్తుంది. ఇప్పటికీ తరగని వయ్యారంతో మెస్మరైజ్ చేస్తుంది. ఆమె పేరు శ్వేతా తివారీ. కేవలం 18 ఏళ్ల వయసులోనే ప్రేమలో పడి భోజ్‌పురి నటుడు రాజా చౌదరిని వివాహం చేసుకుంది. వీరికి పాలక్ తివారీ అనే అమ్మాయి ఉంది. కానీ ఈ వివాహం ఎక్కువ కాలం కొనసాగలేదు. కెరీర్ మంచి ఫాంలో ఉండగానే వ్యక్తిగత జీవితం చిక్కుల్లో పడింది. కసౌతి జిందగీ కి సీరియల్ ద్వారా టీవీ రంగంలో చక్రం తిప్పిన శ్వేతా తివారీ.. ఈ సీరియల్ ద్వారా మరింత పాపులర్ అయ్యింది. ఆ తర్వాత 2013లో నటుడు అభినవ్ కోహ్లీని వివాహం చేసుకోవడం ద్వారా మళ్ళీ కొత్త జీవితాన్ని ప్రారంభించింది. ఈ జంటకు రేయాన్ష్ అనే కుమారుడు కూడా ఉన్నాడు. కానీ మూడేళ్లకే అతడితో విడాకులు తీసుకుంది. రెండుసార్లు విడాకుల తర్వాత ఒంటరిగా ఉండిపోయింది. ప్రస్తుతం తన కూతురు, కొడుకును చూసుకుంటూ సీరియల్స్ చేస్తూ జీవితంలో బిజీగా ఉంటుంది. ప్రస్తుతం ఆమె వయసు 45 సంవత్సరాలు అయినప్పటికీ ఏమాత్రం తగ్గని అందంతో కట్టిపడేస్తుంది. శ్వేత తివారీ... 12 సంవత్సరాల వయసులోనే ట్రావెల్ ఏజెన్సీలో పనిచేయడం ప్రారంభించింది. ఆమె మొదటి జీతం కేవలం ₹500. కానీ నేడు ఆమె ఎపిసోడ్‌కు రూ.3 లక్షలు తీసుకుంటుంది. ప్రస్తుతం టీవీ రంగంలో అత్యధిక పారితోషికం తీసుకుంటున్న హీరోయిన్ ఆమె కావడం విశేషం.



# చిరుతో స్టెప్పులేయనున్న క్రేజీ హీరోయిన్..

ప్రస్తుతం చేతినిండా సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్నారు మెగాస్టార్ చిరంజీవి. డైరెక్టర్ వశిష్ట, చిరు కాంబోలో విశ్వంభర సినిమా వస్తుండగా..మరోవైపు సక్సెస్ ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి దర్శకత్వంలో మన శంకర వరప్రసాద్ గారు సినిమాలో నటిస్తున్నారు. వీరిద్దరి కాంబోలో వస్తున్న సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే వరుస హిట్స్ అందుకుంటున్న అనిల్ రావిపూడి.. ఇప్పుడు చిరుతోనే మరో సక్సెస్ అందుకోవడానికి రెడీ అయినట్లుగా తెలుస్తోంది. చిరంజీవి కామెడీ టైమింగ్, యాక్టింగ్, అనిల్ రావిపూడి మార్క్ ఎంటర్టైన్మెంట్ కలవడంతో ఇప్పుడు ఈ సినిమాపై మరింత ఆసక్తి ఏర్పడింది. వీరిద్దరి కాంబోలో రాబోతున్న సినిమా ప్రేక్షకులకు నవ్వుల విందు పంచడం ఖాయమని అభిమానులు ఆశిస్తున్నారు. తాజాగా ఈ సినిమాకు సంబంధించి ఓ క్రేజీ న్యూస్ ఫిల్మ్ వర్గాల్లో చక్కర్లు కొడుతుంది. తాజాగా ఫిల్మ్ సర్కిల్ లో వినిపిస్తున్న సమాచారం ప్రకారం ఈ సినిమాలో ఓ స్పెషల్ సాంగ్ ఉండనున్నట్లు తెలుస్తోంది. అందులో చిరంజీవితో కలిసి మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా స్టెప్పులేయనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుత కాలంలో తమన్నా స్పెషల్ పాటలకు కేరాఫ్ అడ్రస్ గా మారింది. ఆమె నటించిన కావాలయ్యా, డాడా దాస్ వంటి పాటలు షేక్ చేశాయి. అలాగే హిందీలోనూ వరుసగా స్పెషల్ పాటలతో రచ్చ చేస్తుంది. ఇటీవల ఆమె నటించిన ఆజ్ కీ రాత్ పాట సెన్సేషన్ అయ్యింది. ఇప్పుడు చిరుతో కలిసి స్టెప్పులేయనుంది. వీరిద్దరి కాంబోలో వచ్చే సాంగ్ అదిరిపోయే కిక్ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ఈ పాట కోసం ఇప్పటికే భారీ సెట్ నిర్మించి.. గ్రాండ్ గా చిత్రీకరించేందుకు సన్నహాలు చేస్తుందట. పూర్తి స్థాయిలో ఫ్యామిలీ ఎంటర్టైనర్ గా ఈ సినిమాను రూపొందిస్తున్నారని.. ముఖ్యంగా మెగా మాస్ అభిమానులను ఆకట్టుకోనున్నట్లు టాక్. అలాగే సంగీత దర్శకుడు థమన్ అందించే మ్యూజిక్ మరో హైలెట్ కానుందట.

# రొమాంటిక్‌గా శర్వానంద్ బైకర్ PrettyBaby లుక్..



అభిలాష్ రెడ్డి దర్శకత్వంలో టాలీవుడ్ యువ హీరో శర్వానంద్ నటిస్తున్న చిత్రం బైకర్. Sharwa 36 ప్రాజెక్టుగా వస్తున్న ఈ చిత్రంలో మాళవికా నాయర్ హీరోయిన్‌గా నటిస్తోంది. మీరు బైకర్ స్పీడ్ ఎలా ఉందో చూశారు. ఇక ఇప్పుడు ప్రెప్పీ మెలోడీ టైం వచ్చేసిందంటూ.. ఫస్ట్ సింగిల్ PrettyBaby ప్రోమో అప్‌డేట్ లుక్ విడుదల చేశారు.

హెల్మెట్ పెట్టుకున్న హీరోయిన్‌తో రొమాంటిక్ మూడ్‌లో ఉన్న శర్వానంద్ స్టిల్ సాంగ్‌పై క్యూరియాసిటీ పెంచుతోంది. ఈ పాట ప్రోమోను నవంబర్ 11న లాంచ్ చేయనున్నట్టు ప్రకటించారు. గిబ్రాన్ మ్యాజికల్ ఆల్బమ్‌ను రెడీ చేస్తున్నట్టు తాజా లుక్ చెప్పకనే చెబుతోంది. ఇప్పటికే విడుదల చేసిన గ్లింప్స్.. ఇక్కడ ప్రతీ బైకర్‌కు ఓ కథ ఉంటుంది. సమయంతో పోరాడే కథ.. చావుకు ఎదురెళ్లే కథ.. అంటూ సాగే వాయిస్‌తో ఓవర్‌తో మొదలైన గ్లింప్స్ బైక్ రేసుతో సాగుతుంది. ఏం జరిగినా పట్టువదలని మొండోళ్ల కథ అంటూ బైక్ రేసింగ్ థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో సినిమా ఉండబోతున్నట్టు హింట్ ఇచ్చేస్తుంది. మీ హెల్మెట్లను పట్టుకోండి.. రైడ్ వైల్డ్‌గా ఉండబోతుంది.. గూస్‌బంప్స్ తెప్పించే అడ్వెంచరస్ రైడ్‌కు సిద్ధంగా ఉండండి.. అంటూ శర్వానంద్ టీం ఇప్పటికే బైకర్ సినిమాపై అంచనాలు భారీగా పెంచేస్తుంది. ఈ సినిమాను యూవీ క్రియేషన్స్ బ్యానర్‌లో వంశీ కృష్ణారెడ్డి, ఉప్పలపాటి ప్రమోద్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు. బైకర్‌లో డాక్టర్ రాజశేఖర్ శర్వానంద్ తండ్రి పాత్రలో కనిపించనుండగా... బ్రహ్మాజీ, అతుల్ కులకర్ణి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి గిబ్రాన్ సంగీతం అందిస్తున్నాడు.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314.** email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**